www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
16-09-2024
సంపుటి : 01 | సంచిక : 134 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


డా॥ కాచం సత్యనారాయణ CMD

# రాహుల్‌ను ప్రధానిని చేసినప్పుడే ఫైనల్స్‌లో గెలిచినట్లు



## పీసీసీ నూతన అధ్యక్షుని బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

- ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు, విజయాలు సెమీఫైనల్స్ మాత్రమే..
- 38 నెలలపాటు ప్రజల తరపున పోరాడా
- 6 నెలల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించాం
- కాంగ్రెస్ మాట ఇస్తే.. తప్పక జరిగితీరుతుందని నిరూపించాం
- కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోతేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని చెప్పాం
- 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం
- రీజినల్ రింగ్ రోడ్డుతో తెలంగాణ స్వరూపమే మారుతుంది
- అధిష్ఠానం ఎంతో నమ్మకంతో మహేశ్ కుమార్ గౌడ్ కు బాధ్యతలు
- రాజకీయాల్లో కష్టంతోపాటు కొంచెం అదృష్టం ఉండాలి
- టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్ గౌడ్

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన మహేశ్ కుమార్ గౌడ్ కు సీఎం రేవంత్ రెడ్డి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీభవన్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం ఎంతో నమ్మకంతో మహేశ్ కుమార్ కు కీలక బాధ్యతలు అప్పగించిందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా తాను 38 నెలలపాటు ప్రజల తరపున పోరాడినట్లు చెప్పారు."రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని వరంగల్ డిక్లరేషన్లో రాహుల్ గాంధీ ప్రకటించారు. కాంగ్రెస్ మాట ఇస్తే.. తప్పక జరిగితీరుతుందని నిరూపించాం. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించాం. ఆర్టీసీలో ఇప్పటివరకు 85 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారు. మోదీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచి మహిళలకు భారంగా మార్చింది. మేం రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. వ్యవసాయ రుణం రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులు భయపడొద్దు. రూ. 2లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని రైతులు బ్యాంకుల్లో చెల్లిస్తే రూ.2లక్షల రుణమాఫీ పూర్తవుతుంది.కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోతేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని చెప్పాం. ఇప్పటికే 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇచ్చి విద్యార్థులకు ఎంతో మేలు చేశాం. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10లక్షలకు పెంచాం.ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో హైదరాబాద్ గమనమే మారిపోయింది. కొత్తగా నిర్మించే రీజినల్ రింగ్ రోడ్డుతో తెలంగాణ స్వరూపమే మారుతుంది. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు, విజయాలు సెమీఫైనల్స్ మాత్రమే.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసినప్పుడే మనం ఫైనల్సో గెలిచినట్లు. 2029 ఫైనల్స్లో మనం ఘన విజయం సాధించాలి.

మిగతా2లో...





### ఉత్తమ సమాజ నిర్మాణంలో
# ఉపాధ్యాయుల పాత్రే కీలకం

## గురువులను సత్కరించడం గొప్పవిషయం

- ఒకనాడు వ్యవసాయానికి వైశ్యులు ఇరుసుగా ఉండేవారు
- వారి సంక్షేమం కోసం నావంతు కృషి చేస్తా
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఘనంగా గురు పూజోత్సవం
- రాష్ట్రం నలు మూలల నుంచి హాజరైన ఉపాధ్యాయులు
- డాక్టర్ కాచం సత్యనారాయణకు అభినందనలు

**విశ్వంభర, హైదరాబాద్:**

ఉత్తమ సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ జనసమితి నేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఉపాధ్యాయులు , విద్యార్థుల మధ్య బలమైన బంధముండాలని సూచించారు. టీచర్లు పిల్లల కళ్లలోకి చూస్తూ బోధన సాగించాలని, ఆ చూపునకూ ఎంతో శక్తి ఉంటుందన్నారు. దాంతోనే విద్యార్థులు ప్రభావితమవుతారని, చదువుపై ఆసక్తి పెంచుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని

మిగతా3లో...



# కిక్కిరిసిన ఖైరతాబాద్

- మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- రద్దీని అదుపుచేయ లేకపోయిన పోలీసులు
- ఊపిరాడక సొమ్మసిల్లిన వృద్ధుడు
- ఇబ్బందిపడ్డ మహిళలు, పిల్లలు

2

# అభివృద్ధిలో వెనుకబడిన ఝార్ఖండ్

- అతిపెద్ద శత్రువులు జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ
- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పెట్టుబడులను పెంచింది
- గిరిజనులు, దళితులు, పేదలు, యువత, మహిళల అభివృద్ధికే కేంద్రం తొలి ప్రాధాన్యం
- బీజేపీ ప్రభుత్వం కొలువుతీరగానే అవినీతి, కుంభకోణాలను వెలుగులోకి తెస్తాం
- ఆరు వందే భారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని
- జేఎంఎం సర్కార్‌పై విమర్శలు గుప్పించిన మోదీ



**రాంచీ:** గిరిజనులు, దళితులు, పేదలు, మహిళలు, యువకుల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. వారికి ప్రయోజనం చేకూర్చేందుకు అనేక పథకాలు

మిగతా2లో...

# ఫార్మాసిటీపై స్పష్టత ఇవ్వండి

- ఈ అంశంపై విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలి
- ఇలాంటి కీలకరంగాన్ని ప్రోత్సహిస్తే రాష్ట్రానికి ఆదాయం, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ



**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో తలపెట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. వెంటనే ప్రభుత్వం

మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 106 | ₹ 128 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 186 | ₹ 211 |

# ముగ్గురు ఐపీఎస్‌లపై సస్పెన్షన్ వేటు

## ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

### ముంబయి నటి వ్యవహారంలో చర్యలు



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా తాతా, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం

మిగతా2లో...

### రెండు రోజుల్లో
# సీఎం పదవికి రాజీనామా



- నిర్దోషిగా నిరూపించుకునేంత వరకూ ఆ పదవిలో ఉండను
- కేజ్రీవాల్ సంచలన ప్రకటన..
- త్వరలో కొత్త ముఖ్యమంత్రి ఎంపిక...
- ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర
- మా పార్టీని ముక్కలు చేసేందుకే నన్ను జైలుకు పంపారు
- సత్యం విజయం సాధించింది
- ఉద్వేగంగా ప్రసంగించిన ఢిల్లీ సీఎం

**ఢిల్లీ:**

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తా అని కేజ్రీవాల్ ప్రకటించారు. మళ్లీ ప్రజల మధ్యకు వెళతానని చెప్పారాయన. తన భవిష్యత్తును ప్రజలే నిర్ణయిస్తారన్నారు. తాను అవినీతి చేయలేదని భావిస్తేనే ప్రజలు తనకు ఓటేయాలని పిలుపునిచ్చారు. మళ్లీ గెలిస్తేనే సీఎం పదవిని చేపడతా అని కేజ్రీవాల్ ప్రకటించారు. ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు సాక్షాత్తు దేవుడే తమతో ఉండి ముందుకు నడిపించాడని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఆప్ నాయకులు సత్యేందర్ జైన్, అమానతుల్లా ఖాన్ ఇంకా జైల్లోనే ఉన్నారని.. భగవంతుడు ఇచ్చిన ధైర్యంతో శత్రువులతో

మిగతా10లో...

కౌన్ బనేగా నెక్స్ట్ ఢిల్లీ సీఎం? 10



2

## ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశం..

డిప్యూటీ సీఎం భట్టికి ఆహ్వానం

## రాజకీయాల్లోకి రావొద్దని నేను ముందే చెప్పాను

సామాజికసేవతో ప్రజల్లో ఉండాలి 2

దాంతో గొప్ప వ్యక్తివి అవుతావు

కేజ్రీవాల్ రాజీనామా ప్రకటనపై అన్నా హజారే వ్యాఖ్యలు



టంగుటూరి రామకృష్ణపై పోలీసు స్టేషన్లో చేసిన ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న బాధితులు

# ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు

## టంగుటూరి రామకృష్ణపై కేసు నమోదు

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ర అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణపై హైదరాబాద్లోని కాచిగూడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదయ్యింది. రామకృష్ణ..పసుమర్తి మల్లిఖార్జున్ తో కలిసి ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ (వామ్) మీటింగ్ ను అబుదాబి లో పెద్దయెత్తున నిర్వహిస్తున్నట్లు గా మోసపూరితమైన ప్రకటనలు చేసి వామ్ సభ్యత్వం తీసుకుంటే మీటింగ్ రావడానికి అర్హులని నమ్మించి సభ్యత్వ రుసుం పేరిట రూ.2500, అబుదాబి మీటింగ్ కోసం రూ.87వేలు, కాన్ఫరెన్స్ పేరిట రూ.5వేలు మా దగ్గరి నుంచి వసూలు చేశారని ఆదిలాబాద్ కుచెందిన పలువులు ఆర్యవైశ్యులు కాచిగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పైన తెలిపిన మొత్తాన్ని గూగుల్ పే, ఫోన్ పే ద్వారా చెల్లించినట్లు తెలిపారు. అబుదాబి మీటింగ్ కు వెళ్లేందుకు శంషాబాద్ విమానశ్రయానికి వెళ్లామని, అక్కడకు వెళ్లిన తర్వాత విజిట్ వీసాలు, విమాన టిక్కెట్లు ఇవ్వకుండా టంగుటూరి రామకృష్ణ, పసుమర్తి మల్లిఖార్జున్ మోసం చేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై క్రైమ్ నెంబర్. 337/2024తో భారత న్యాయ సంహిత సెక్షన్లు 316 (2) 318 (4), 351 (2) కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఫార్మాసిటీపై స్పష్టత ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశంపై విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ను అంతర్జాతీయంగా నంబర్ వన్ గా నిలిపే ఉద్దేశంతో ఫార్మా సిటీ అనే బృహత్తరమైన ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. ఇప్పటికే తెలంగాణ ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తుల్లో దేశంలోనే 40శాతం వాటా కలిగి ఉందన్నారు. వెయ్యికి పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం అడ్డాగా ఉందని, ఏటా 80 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను తెలంగాణ నుంచి తయారు చేస్తున్న విషయం ముఖ్యమంత్రికి తెలిసే ఉంటుందన్నారు. ఇలాంటి కీలకమైన రంగాన్ని మరింత ప్రోత్సహిస్తే రాష్ట్రానికి ఆదాయం పెరగడంతో పాటు యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. ఈ ఉద్దేశంతోనే 9.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే విధంగా తాము ఫార్మా సిటీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని భావించామన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తైయితే అంతర్జాతీయంగా ఫార్మా, లైఫ్ సైన్సెస్ ఉత్పత్తుల్లో తెలంగాణ టాప్లో ఉంటుందని చెప్పారు. 5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి అందించవచ్చన్న భావనతో ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు గుర్తు చేశారు.

# ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశం..

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం లభించింది. నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం అందింది. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు.. మెక్సికో దేశంలో న్యూవోలియోన్లోని మోంటెగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా భట్టి విక్రమార్కకు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది.ప్రగతి కోసం శాంతి అనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాలు జరగనున్నాయి. నోబెల్ గ్రహీతలు, ప్రపంచ శాంతి న్యాయవాదుల సామూహిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ, వ్యూహాలను ఈ శిఖరాగ్ర సమావేశంలో రూపొందిస్తామని ఆహ్వాన పత్రికలో నిర్వాహకులు తెలిపారు.

# ముగ్గురు ఐపీఎస్లపై సస్పెన్షన్ వేటు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురిపై ముంబయి నటి వ్యవహారంతోపాటు పలు అభియోగాలున్నాయి.తప్పుడు కేసులో ముంబయి సినీ నటి కాదంబరీ జత్వానీని అరెస్టు చేసి, ఇబ్బందులకు గురిచేసిన వ్యవహారంలో కీలకపాత్రధారులని చెబుతున్న నాటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా, డీసీపీ విశాల్ గున్ని చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఐపీఎస్ అధికారులపైనే తీవ్రస్థాయి ఆరోపణలు రావడంతో దీనిపై డీజీపీ ద్వారకా తిరుమలరావు విచారణకు ఆదేశించారు. ఆయన ఆదేశాలతో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు.. ఇబ్రహీంపట్నం స్టేషన్లో కాదంబరీ జత్వానీ, ఆమె కుటుంబసభ్యులపై నమోదైన కేసు ఫైళ్లను పరిశీలించారు. కేసు నమోదు, దర్యాప్తులో అనేక లొసుగులు ఉన్నట్లు గుర్తించారు. వీటిపై నివేదికను రూపొందించి డీజీపీకి అందజేశారు.

# సీఎం వైపు దూసుకెళ్లిన యువకుడు.. పట్టుకున్న భద్రతా సిబ్బంది..



బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య పర్యటనలో భారీ భద్రతా లోపం వెలుగు చూసింది. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వేదికపై కూర్చున్న సీఎం సిద్ధరామయ్య వైపు ఓ యువకుడు దూసుకెళ్లాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతన్ని వెంటనే పట్టుకున్నారు. అనుమానాస్పదంగా ఉన్న యువకుడిని భద్రతా సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సదరు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య వేదికపై ఉండగా.. ఓ యువకుడు ప్రేక్షకుల గ్యాలరీ నుంచి లేచి వేదికపైకి దూకాడు. వెంటనే అక్కడనే ఉన్న భద్రతా సిబ్బంది సీఎం కుర్చీ వైపు రాకుండా యువకుడిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అయితే, యువకుడు ఎందుకు సీఎం వైపు ఎందుకు దూసుకువెళ్లాడు అనే కారణం తెలియరాలేదు. అదే సమయంలో సదరు యువకుడి వివరాలు సైతం తెలియలేదు. ప్రస్తుతం పోలీసులు సదరు యువకున్ని విచారిస్తున్నారు.

# కుప్ప కూలిన మూడంతస్తుల భవనం.. 9 మంది సజీవ సమాధి



**లక్నో:** ఉత్తరప్రదేశ్లోని మీరట్లో మూడంతస్తుల భవనం కుప్పకూలింది. దీంతో 9 మంది సజీవ సమాధి అయ్యారు. మీరట్లోని జాకీర్ కాలనీలో భవనం కూలిపోయింది. ఇప్పటివరకు 9 మంది చనిపోగా, మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వర్షం కురుస్తున్నప్పటికీ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు శిథిలాలను తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యాయి.శిథిలాల కింద 14 మంది చిక్కుకుపోయారని జిల్లా కలెక్టర్ దీపక్ మీనా వెల్లడించారు. వారిలో ఎనిమిది మందిని రక్షించామన్నారు. మిగిలిగినవారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘటన శనివారం సాయంత్రం జరిగిందని తెలిపారు. కాగా, ప్రమాద ఘటనపై యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

# రాహుల్ ప్రధానిని చేసినప్పుడే ఫైనల్స్ లో గెలిచినట్లు

(మొదటి పేజీ తరువాయి)

1994 నుంచి రాష్ట్రంలో ప్రతిపార్టీ రెండు సార్లు గెలిచింది. కాంగ్రెస్ కూడా కచ్చితంగా వరుసగా రెండు సార్లు అధికారంలోకి వస్తుంది. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి ఎవరైనా వస్తే ఉపేక్షించేది లేదు" అని రేవంత్రెడ్డి హెచ్చరించారు.

**టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్కుమార్ గౌడ్**

తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం గాంధీభవన్లో ఆయన పీసీసీ పగ్గాలు చేపట్టారు. సీఎం రేవంత్రెడ్డి నుంచి పీసీసీ అధ్యక్ష బాధ్యతలను మహేశ్కుమార్ గౌడ్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్లో సందడి నెలకొంది.సీఎం రేవంత్రెడ్డి సహా మంత్రులు, కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ పలువురు ఏఐసీసీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మహేశ్కుమార్ గౌడ్ గన్పార్కు నుంచి ర్యాలీగా గాంధీభవన్కు వచ్చారు. ర్యాలీ పెద్దఎత్తున వాహనాలు, గుర్రాలు, బగ్గీ వాహనాలు, ఆదివాసీల నృత్యాలు, బోనాలు, శివ సత్తుల ప్రదర్శనలతో జరిగింది. ఆ తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ దమ్ము, ధైర్యంతో కూడిన పోరాటం వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ అన్నారు. రానున్న రోజుల్లోనూ మరింత దమ్ము, ధైర్యం చూపించాల్సి ఉందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా తన నియామకం కార్యకర్తలకు గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం చేయటంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని నిరూపితమైందని వెల్లడించారు.

**రాజకీయాల్లో కష్టంతోపాటు కొంచెం అదృష్టం ఉండాలి: మహేశ్ కుమార్ గౌడ్**

తాను వెలుగులోకి రానప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని మహేశ్కుమార్ గౌడ్ తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సభలో మాట్లాడారు. గాంధీభవన్తో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని, కాంగ్రెస్లో 1985లో ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడిగా తన ప్రస్థానం ప్రారంభమైందని మహేశ్కుమార్ గౌడ్ తెలిపారు. కౌశిక్రెడ్డి వాడిన భాష వల్లే అరెకపూడి గాంధీ అనుచరులు నొచ్చుకున్నారని, బూతులు తిట్టుకోవటం తెలంగాణ రాజకీయాల్లో గతంలో లేదని ఆయన పేర్కొన్నారు. 2014లో కేసీఆర్ సీఎం అయ్యాకే, తెలంగాణ రాజకీయాల్లో భాష మారిపోయిందని, కేసీఆర్కు దీటుగా సమాధానం చెప్పేందుకే రేవంత్రెడ్డి కూడా కాస్త గట్టిగా మాట్లాడారని గుర్తుచేశారు. పార్టీని నమ్ముకుంటే ఎప్పటికైనా న్యాయం జరుగుతుందని తనకు పీసీసీ పదవితో నిరూపితమైందని వెల్లడించారు."మనం ఎంత పనిమంతులం అయినా..



చేసేందుకు పని ఇచ్చేవారు కూడా ఉండాలి. నమ్మి పని ఇచ్చేవారు లేకపోతే మన ప్రతిభ బయటకు రాదు. రాజకీయాల్లో కష్టంతోపాటు కొంచెం అదృష్టం ఉండాలి. సీఎం రేవంత్రెడ్డి చదువు, వైద్యం, క్రీడల విషయంలో దూరదృష్టితో ఆలోచిస్తున్నారు. వారంలో ఇద్దరు మంత్రులు గాంధీభవన్కు వస్తే మంచిది. గాంధీభవన్ మీద ఆశ. నమ్మకంతో వచ్చిన కార్యకర్తలకు న్యాయం చేయాలి. ఇవాళ చిన్న ప్రాంతీయ పార్టీలకు కూడా జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ కూడా జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకోవాల్సి ఉంది" అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

# అభివృద్ధిలో వెనుకబడిన ఝార్ఖండ్

(మొదటి పేజీ తరువాయి)



ప్రారంభించామని అన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన ఝార్ఖండ్ కూడా ఈ ప్రాజెక్టుల ప్రారంభంతో వేగంగా వృద్ధి చెందుతుందని చెప్పుకొచ్చారు. రాంచీలో ఆరు వందేభారత్ రైళ్లను వర్చువల్గా జెండా ఊపి ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. "ఝార్ఖండ్ అభివృద్ధిలో వెనుకబడి ఉంది. ప్రస్తుతం అనేక ప్రాజెక్టులు ఇక్కడకు వచ్చాయి. గిరిజనులు, దళితులు, పేదలు, యువత, మహిళలు అభివృద్ధికే కేంద్రం తొలి ప్రాధాన్యం ఇస్తుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రాంచీ నుంచి విమానంలో టాటానగర్ రాలేకపోయాను. విమానం టేకాఫ్కు కుదరలేదు. టాటానగర్ చేరుకోలేకపోయినందుకు ప్రజలకు క్షమాపణలు కోరుతున్నా. రైల్వే, ఇతర ప్రాజెక్టుల వల్ల తూర్పు ప్రాంతంలో పరిశ్రమలు, పర్యటకం పెరుగుతుంది. ఝార్ఖండ్ అభివృద్ధికి కేంద్రం పెట్టుబడులను పెంచింది. ఈ ఏడాది ఝార్ఖండ్కు రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కి రూ.7,000 కోట్లు కేటాయించింది. గడిచిన 10 ఏళ్ల బడ్జెట్ తో పోల్చితే ఇది 16 రెట్లు ఎక్కువ. రైల్వే నెట్వర్క్ లో 100 శాతం విద్యుదీకరణ సాధించిన రాష్ట్రాల జాబితాలో ఝార్ఖండ్ చేరింది" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

**జార్ఖండ్కు అతిపెద్ద శత్రువులు జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ..**

జార్ఖండ్ ముక్తి మోర్చా, ఆర్జేడీ, కాంగ్రెస్ జార్ఖండ్కు అతిపెద్ద శత్రువులని పాలక జేఎంఎం సర్కార్పై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ ఏర్పాటుకు ఆర్జేడీ ఇప్పటికీ ప్రతీకారం తీర్చుకుంటున్నదని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ దీర్ఘకాలంగా జార్ఖండ్పై విద్వేషం విరజిమ్ముతోందని అన్నారు. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జేఎంఎం గిరిజనులకు ద్రోహం చేసిందని మండిపడ్డారు.అటవీ భూములను ఆక్రమించుకున్న వారితో జేఎంఎం చేతులు కలిపిందని విమర్శించారు. బంగ్లాదేశీ, రోహింగ్యాలతో జేఎంఎం కుమ్మక్కైందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అడుగుజాడల్లో జేఎంఎం నడుస్తూ బుజ్జగింపు రాజకీయాలను ఒంటబట్టించుకుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ బాటలో నడిస్తే బుజ్జగింపు రాజకీయాలు అలవాటవుతాయని, దీంతో దళితులు, గిరిజనులు, బీసీలకు తీరని నష్టం వాటిల్లుతుందని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ బాటలోనే పాలక జేఎంఎం అవినీతిలో కూరుకుపోయింది..**

కాంగ్రెస్ బాటలోనే పాలక జేఎంఎం అవినీతిలో కూరుకుపోయిందని ప్రధాని మోదీ ఆరోపించారు. జేఎంఎం ఐదేండ్ల పాలనలో జార్ఖండ్ను లూటీ చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఏ రంగాన్నీ వదలకుండా స్కామ్లతో రాష్ట్రాన్ని దోచేశారని మండిపడ్డారు. నీరు, అటవీ సంపద, భూములు ఇలా ప్రతిచోటా వనరులను దోచేశారని దుయ్యబట్టారు. జార్ఖండ్లో బీజేపీ ప్రభుత్వం కొలువుతీరగానే అవినీతి, కుంభకోణాలను వెలుగులోకి తెస్తామని అన్నారు. విచారణ చేపట్టి ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామని మోదీ భరోసా ఇచ్చారు. 70 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్లందరికీ ఉచిత చికిత్స అందిస్తామని గ్యారంటీ ఇచ్చారు.

**ఆరు వందే భారత్ రైళ్లను ప్రారంభించిన మోదీ..**

పలు మార్గాల్లో ప్రయాణించే ఆరు వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ రాంచీలో వర్చువల్ గా జెండా ఊపి ప్రారంభించారు. రూ.660 కోట్ల విలువైన వివిధ రైల్వే ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు. అలాగే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ్ కింద 32,000 మంది లబ్దిదారులకు వర్చువల్ గా మంజూరు లేఖలను అందించారు. ఈ క్రమంలో పేదలకు పక్కా ఇళ్లు నిర్మాణానికి మొదటి విడతగా రూ.32 కోట్లను విడుదల చేశారు. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద ఝార్ఖండ్కు 1,13,400 ఇళ్లను కేంద్రం కేటాయించింది.



# కిక్కిరిసిన ఖైరతాబాద్

**విశ్వంభర, హైదరాబాద్:**

ఖైరతాబాద్ భక్త జనసంద్రంగా మారింది. హైదరాబాద్ పాటు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి మహాగణపతి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఖైరతాబాద్ ప్రాంతం కిటకిటలాడుతోంది. ఈనెల 17న (మంగళవారం) గణేశ్ నిమజ్జన కార్యక్రమం ఉండటంతో ఆదివారం అర్ధరాత్రి వరకే దర్శనానికి అనుమతిస్తామని ఉత్సవ కమిటీ ప్రకటించింది. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది.ఐమ్యాక్స్ వైపు నుంచి జనం భారీగా తరలివచ్చారు. బారికేడ్లు తొలగించడంతో రద్దీని అదుపు చేయడం పోలీసులకు కష్టంగా మారింది. క్యూలైన్లో ఉన్న ఓ వృద్ధుడు ఊపిరాడక సొమ్మసిల్లి పడిపోయాడు. గణేశ్ విగ్రహం కూడలిలో



కాలు కదపలేని పరిస్థితి నెలకొనడంతో మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బంది పడ్డారు. మరో వైపు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. వర్షంలో తడుస్తూనే భక్తులు గణపయ్యను దర్శించుకుంటున్నారు.

# రేవంత్ రెడ్డి పదవిలో ఉండేది ఐదేళ్లే..

- ఐదేళ్లకు మించి కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేదు
- విద్యా భరోసా కార్డు, రూ.2లక్షల రుణమాఫీ విషయంలో మోసం చేశారు
- ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ఫోర్త్ సిటీ పేరిట డ్రామాలు ఆడుతున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** అదృష్టం కొద్దీ గెలిచిన రేవంత్ రెడ్డి ఐదేళ్లు మాత్రమే పదవిలో ఉంటారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఐదేళ్లకు మించి కాంగ్రెస్పార్టీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేదన్నారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్ గఢ్, రాజస్థాన్లో ఐదేళ్లకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దింపేశారని గుర్తు చేశారు. రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని మోసం చేసింది రేవంత్రెడ్డి కాదా? అని ప్రశ్నించారు."రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసింది మీరు కాదా? సీఎం పదవిలో కూర్చున్న వ్యక్తి హుందాగా మాట్లాడాలి. రుణమాఫీ విషయంలో సీఎం ఒకరకంగా.. వ్యవసాయశాఖ మంత్రి ఒకరకంగా చెబుతున్నారు. వానాకాలం రైతు భరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదు. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి అంతా బోగస్ చేసిందెవరు? ఫార్మాసిటీ కోసం కేసీఆర్ ప్రభుత్వం 12వేల ఎకరాలు సేకరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఫోర్త్ సిటీ పేరిట డ్రామాలు ఆడుతున్నారు" అని హరీశ్ రావు విమర్శించారు.

# రాజకీయాల్లోకి రావొద్దని నేను ముందే చెప్పాను



**ఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. సీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన ఢిల్లీ రాజకీయాల్ని హీటెక్కించింది. మద్యం పాలసీ కేసులో అరెస్టయి శనివారమే బెయిల్పై విడుదలైన కేజ్రీవాల్.. సంచలన ప్రకటన చేశారు. రెండురోజుల్లో రాజీనామా చేస్తా.. కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటా.. ప్రజాక్షేత్రంలో పోరాడి.. కడిగిన ముత్యంలా బైటికొచ్చాకే మళ్లీ ముఖ్యమంత్రి అవుతా.. అరవింద్ కేజ్రివాల్ విసిరిన ఓపెన్ ఛాలెంజ్ ఇది.ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని కేజ్రీవాల్ చెప్పగానే, వద్దువద్దంటూ నినాదాలు చేశారు ఆమ్ఆద్మీ కార్యకర్తలు. కానీ.. దోషిగా పడ్డ మరకను తుడిచేసుకోవాలి.. నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు ఈ పదవి నాకొద్దు అన్నారు కేజ్రివాల్. నేను అవినీతికి పాల్పడలేదని వాళ్లకూ తెలుసు.. నా పార్టీని చీల్చి, సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నదే వాళ్ల కుట్ర అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు కేజ్రివాల్.ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఈ నిర్ణయంపై సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందించారు. అరవింద్ కేజ్రీవాల్ రాజకీయాల్లోకి రావడానికి ముందే తాను నిరాకరించానని అన్నారు. 'రాజకీయాల్లోకి వెళ్లొద్దని.. సమాజానికి సేవ చేయాలని, దాంతో గొప్ప వ్యక్తి అవుతారని సూచించినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఇద్దరం కలిసి ఉన్నామని, రాజకీయాల్లోకి రావద్దని..సామాజిక సేవా కార్యక్రమాలతోనే ప్రజల్లో ఉండాలంటూ పదే పదే చెప్పానన్నారు. గతంలో సంతోషం వ్యక్తం చేసిన ఆయన, ఆ తర్వా అతని హృదయంలో ఉన్నది ఇప్పుడు లేదన్నారు.



# ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రే కీలకం

(మొదటి పేజీ తరువాయి)

పురస్కరించుకొని వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో గురు పూజోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్ కర్మన్ ఘాట్ లోని లక్ష్మి కన్వెన్షన్ హాల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైశ్య వికాస వేదిక ఫౌండర్ ఛైర్మన్ , వీ 3 న్యూస్ ఛానల్, విశ్వంభర దిన పత్రికల అధినేత డా. కాచం సత్యనారాయణ గుప్త అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 200 మంది వైశ్య ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రంతో పాటు మెమెంటోలను ప్రదానం చేశారు. జల వనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరమళ్ళ ప్రకాష్ , అడిషనల్ సూపరింటెండెంట్ (యాంటీ నార్కోటిక్ బ్యూరో) పాలాది కృష్ణమూర్తి గురు పూజోత్సవంలో పాల్గొని టీచర్లకు సన్మానం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కోదండరాం మాట్లాడుతూ.. గురువులను సత్కరించడం చాలా గొప్పవిషయం అన్నారు. ఉపధ్యాయులను సన్మానించడమే కాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్న డాక్టర్ కాచం సత్యనారాయణను అభినందించారు. ఆయన ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. బతకలేక బడిపంతులు అనే రోజులు ఇప్పుడు లేవని, ప్రస్తుతం ఆర్థికంగా వారు ఒక మేరకు మంచి జీత భత్యాలనే



పొందుతున్నారని అన్నారు. అయితే ప్రయివేట్ విద్యాసంస్థల ప్రాబల్యం పెరిగిన తరుణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల గౌరవం, గుర్తింపు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**అంకితభావంతోనే గౌరవం...**

**రావికంటి రామయ్య గుప్త ఆదర్శం...**

ఉపాధ్యాయులు తమ విధిని అంకిత భావంతో నిర్వర్తించడం ద్వారా గౌరవాన్ని ఇనుమడింపజేసుకోవచ్చని ఆచార్య కోదండరాం అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన రావికంటి రామయ్య గుప్త పేరును ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించి ఉపాధ్యాయుడిగానూ, కవిగానూ తనదైన ముద్ర వేసిన రామయ్య గుప్తకు మంథనిలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి అక్కడివారు ఘనంగా నివాళులు అర్పించుకుంటున్నారని అన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తే సమాజం ఎంతగా గౌరవించుకుంటుందనడానికి ఇది మంచి ఉదాహరణ అన్నారు. రావికంటి రామయ్య గుప్తను ఆదర్శంగా తీసుకుని టీచర్లు పనిచేయాలని సూచించారు. ఒకనాడు వ్యవసాయానికి వైశ్యులు ఇరుసుగా ఉండేవారని , వ్యవసాయానికి సంబంధించిన వాటిని వైశ్యులు ఇతర ప్రాంతాల నుండి తీసుకువచ్చి రైతులకు అందించేవారని కోదండరాం గుర్తుచేశారు. కాలక్రమంలో ఒకటి రెండు కార్పొరేట్ సంస్థలకు మాత్రమే ప్రభుత్వాలు మద్దతు పలకడంతో పెనుమార్పులు వచ్చి వృత్తులపై ప్రభావం పడుతోందన్నారు. చిన్న చిన్న దుకాణాలు నడుపుకొనే పేదవైశ్యుల వ్యాపారాలు దెబ్బతింటున్నాయని అన్నారు. వైశ్యులు అన్ని రంగాలలో ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తున్నారని , సమాజంలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారని అన్నారు.వైశ్యుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని కోదండరాం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## వైశ్యుల వికాసం కోసమే నిరంతరం పోరాటం

**డా. కాచం సత్యనారాయణ..**



సభాధ్యక్షుడు డా. కాచం సత్యనారాయణ మాట్లాడుతూ వైశ్య వికాస వేదిక ద్వారా వైశ్యుల అభ్యున్నతి కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక, సామాజిక , రాజకీయాలలో వైశ్యుల వృద్ధి కి నిరంతరం పోరాడుతున్నామని అన్నారు ప్రతి సంవత్సరం వివిధ రంగాలలో విజయాలు సాధించిన వారికి, ప్రతిభ చూపిన వారికి వైశ్య వికాస వేదిక ద్వారా సత్కార కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అభినందన కార్యక్రమాలు చేపడతున్నామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, గ్రూప్స్, సివిల్స్ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఉచితంగా భోజన వసతి, పుస్తకాలతో పాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే నిరుపేద వైశ్య విద్యార్థులకు చదువులకు ఆర్థిక చేయూత అందించడం , అభాగ్యులకు అన్నదాన కార్యక్రమాలు చేయడం వంటి కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు.

## ఉపాధ్యాయులు గురువులుగా మారాలి: వి.ప్రకాష్

పాఠాలు మాత్రమే చెప్పేవారు ఉపాధ్యాయులని, జీవిత పాఠాలు చెప్పే వారు గురువులని జల వనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరమళ్ళ ప్రకాష్ అన్నారు. ఉపాధ్యాయులు గురువులుగా మారాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవాలని అప్పుడే దేశానికి ఉపయోగపడే పౌరులు తయారవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. తల్లి, తండ్రి తర్వాత గురువుకే ఎంతో ప్రాధాన్యముందని, పిల్లలు సక్రమ మార్గంలో ఎదిగేందుకు ఈ అందరూ తమ పాత్రను సమర్థంగా పోషించాలని అన్నారు. సైన్స్, టెక్నాలజీ నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయని, అందుకు అనుగుణంగా అందరూ అప్‌డేట్ కావాలన్నారు. ఆరోగ్య కరమైన అలవాట్లను తాము చేసుకోవడమే కాకుండా పిల్లలకూ అలవర్చాలని సూచించారు. పురస్కారం పొందిన ఉపాధ్యాయులకూ, వైశ్య వికాస వేదిక ట్రస్ట్ సభ్యులకు , ఫౌండర్ ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణకు వీరమళ్ల ప్రకాష్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వైశ్యులు కూడా చిరువ్యాపారాలకే పరిమితం కాకుండా పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చుకుంటూ ముందుకు సాగాలని, పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక ప్రధాన కార్యదర్శి నంగునూరి రమేష్, కోశాధికారి రామ్ నరేష్ కండె , విశ్వంభర దిన పత్రిక అసోసియేట్ ఎడిటర్ రావికంటి శ్రీనివాస్ , తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళావిభాగ్ ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ , కొదుమూరి దయాకర్ రావు, వంగవీటి శ్రీనివాస్, రాఘవేందర్, రమణ, సలహాదారులు మునుగోటి యాదయ్య గుప్త , కాచం సాయి వైశ్య వికాస వేదిక ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి




**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రలోని రఘుపతి కాంప్లెక్స్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మృదు స్వభావి కర్నాటి మనోహర్ 70 వ జన్మదిన వేడుకలో మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పాల్గోన్నారు. ఈ సందర్భంగా మనోహర్ ని ఆశీర్వదిస్తూ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 17న పెంజర్ల అనంత పద్మనాభ స్వామి జయంతి

**జయంతి ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలి**

**ఆలయ కమిటీ ఛైర్మన్ బెజవాడ అనితారెడ్డి**

**విశ్వంభర, రంగారెడ్డి:** కొత్తూరు మండలంలోని పెంజర్ల అనంత పద్మనాభ స్వామి జయంతి ఉత్సవాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలయ కమిటీ ఛైర్మన్ బెజవాడ అనిత రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17 మంగళవారం ఉదయం 7.గంటలకు అభిషేకం, 10.30 నిమిషాలకు వ్రతం పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆమె తెలిపారు. మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. స్వామివారి జయంతి ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు భక్తులు మీడియా సోదరులు హాజరుకావాలని ఆమె సూచించారు. అనంత పద్మనాభ స్వామి జయంతి సందర్భంగా భక్తులు వ్రతాలు చేయొచ్చని చెప్పారు. వ్రతాలు చేసే భక్తులు 16వ తేదీ సాయంత్రం వరకు ఆలయ కమిటీని సంప్రదించాలని ఆమె సూచించారు.




ఎంజీబీఎస్ బస్ స్టాండ్‌లో బొర్ర అరుణ్ అంబేద్కర్ యొక్క అరుణ్ టీ, స్నాక్స్ క్యాంటీన్ని విజిట్ చేసిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్యాల జైపాల్ రెడ్డి, కుందూరు చంద్ర శేఖర్ రెడ్డి, పల్స జనార్ధన్ గౌడ్, బొర్ర చిన్నబాబు, పేరెల్లి అజయ్, మహేష్, ఘంట శ్రావణ్, ఆర్టీసీ స్టాల్ ఓనర్స్ తదితరులు.

- విశ్వంభర, హైదరాబాద్

## నవరాత్రి ఉత్సవాల్లో గుడిపల్లి శ్రీనివాస్

**విశ్వంభర, షాద్ నగర్ :** విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) మఫిషియల్ జర్నలిస్టు కమిటీ రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం భీమారం గ్రామంలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నిర్వహించిన పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి తన చేతుల మీదుగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు పేపర్ శ్రీనివాస్ ను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే ఆదిదేవుడు విఘ్నేశ్వరుడని, ఆయన ను భక్తి శ్రద్ధలతో పూజిస్తే మనం తెలిసి తెలియక చేసిన దోషాలను తొలగించి కుటుంబంలో సుఖశాంతు



లను నింపుతాడని అన్నారు. ప్రజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రాఘవేందర్ యాదవ్ (రఘు), రమేష్, కుమార్, రాజు గ్రామస్తులు శ్రీనివాస్, నర్సిములు, వీరేషం, జంగయ్య, లక్ష్మయ్య యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలను దర్శించుకున్న కాటా సునీత

**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దర్శించుకుని అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను అమీన్పూర్ మున్సిపల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు కాట సునీత రాజేష్ గౌడ్ ప్రారంభించారు. గణేష్ మండప నిర్వాహకులు కాటా సునీత రాజేష్ గౌడ్ ను శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కాటా సునీత రాజేష్ గౌడ్ మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రజ



లందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## ప్రారంభం సరే..విధులకు డాక్టర్ ఎక్కడ ..?

**విశ్వంభర, భూపాలపల్లి :** మొగుళ్లపల్లి ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తేవాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్ రెసిడెన్షియల్ క్వార్టర్ ను రూ. 19.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు సరే రెసిడెన్షియల్ క్వార్టర్ లో ప్రజలకు అందుబాటులో ఉండి




వైద్య సేవలను అందించే డాక్టర్ ను ఎవరిని నియమించారో ప్రజలకు అర్థం కావడం లేదు. రాత్రి వేళల్లో పాముకాటుకు గానీ..తేలుకాటుకు గానీ కుక్కలు, కోతులు కరిచినప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో వారు వ్యయ, ప్రయాసలకు ఓర్చుకొని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని అన్నారు. త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో కుక్కల బీభత్సం



**విశ్వంభర, వనస్థలిపురం :** సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో పార్కు ముందు ఉన్న రోడ్డుపై వీధి కుక్కల బీభత్సం సృష్టిస్తున్నాయి. మహిళలపై దాడికి శునకాలు ప్రయత్నిస్తున్నాయి. వీధులలో నడవడానికి స్థానిక ప్రజలు , మహిళలు , చిన్న పిల్లలు భయాందోళన చెందుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు . సామాజిక కార్యకర్త చేపూరి శంకరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు జిహెచ్ఎంసి సిబ్బంది ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ప్రజలప్రాణాలు కాపాడాలని స్వచ్ఛంద సేవ సంస్థలు కూడా ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

## త్రిపురారం మాజీ ఎంపీపీ భర్తపై కత్తితో దాడి

**విశ్వంభర, త్రిపురారం:** నల్గొండ జిల్లా త్రిపురారం మండలం మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ భర్త అనుముల శ్రీనివాస్ రెడ్డిపై ఆదివారం సాయంత్రం ఓ యువకుడు కత్తితో దాడి చేశాడు. తాగిన మైకంలో ఉన్న యువకుడు ఓ విషయంలో న్యాయం చేయలేదంటూ శ్రీనివాస్ రెడ్డి పై దాడి చేయడంతో కడుపులో రెండు చోట్ల గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అతనిని హైదరాబాద్ తరలించారు. దాడికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపాలిటీ బీరంగూడ పరిధిలోని సాయి భగవాన్ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. అన్నదాత అమీన్పూర్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నందారం నరసింహా గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గత 15 సంవత్సరాలుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నవరాత్రి ఉత్సవాలను ఏర్పాటు చేస్తున్నామని సాయి భగవాన్ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులు కృష్ణ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.



# మలేరియా వ్యాధి పట్ల అవగాహన అవసరం

## నేడు ఆయన వర్ధంతి



ప్రాణాంతక వ్యాధి మలేరియా పట్ల ప్రజలలో అవగాహన పెంచడం, చికిత్స చేయడం, నివారించడం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం అత్యవసరం. మలేరియా అనే పేరు "మల అరియ" అనే ఇటాలియను పదాల నుండి పుట్టింది. "మల అరియ" అంటే చెడిపోయిన గాలి అని అర్థం. చిత్తడి నేల ఉన్న చోట్ల మలేరియా అధికంగా ఉండటం వలన ఈ జ్వరాన్ని చిత్తడి జ్వరం అని కూడా పిలిచేవారు.

సర్ రోనాల్డ్ రాస్ బ్రిటిష్ వైద్యుడు, శాస్త్రవేత్త. ఆయనకు మలేరియా పారసైట్ జీవితచక్రానికి చెందిన పరిశోధనకు 1902లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయబడింది. 1897 లో ఒక దోమ యొక్క జీర్ణశయాంతర ప్రేగులలో మలేరియా పరాన్నజీవిని ఆయన కనుగొన్నప్పుడు మలేరియా దోమల ద్వారా వ్యాపిస్తుందని ఋజువు చేసింది. ఈ వ్యాధిని ఎదుర్కొనే పద్ధతికి పునాది వేసింది. భారతీయ వైద్య సేవలో 1881 లో ప్రవేశించి 25 సంవత్సరాలు పనిచేశాడు. తన సేవలోనే అతను సంచలనాత్మక వైద్య ఆవిష్కరణ చేశాడు.1895 మార్చి 20న ఆయన లండన్ నుండి బయలుదేరి, ఏప్రిల్ 24న సికింద్రాబాదు చేరాడు. కస్టమ్ ఆఫీసులో తన సామాను క్లియర్ కావడానికి ముందే, అతను నేరుగా బొంబాయి సివిల్ హాస్పిటల్ కి వెళ్లి, మలేరియా రోగుల కోసం వెతుకుతూ రక్త నమూనాలు సేకరించడం ప్రారంభించాడు. రాస్ మే 1895 లో దోమల కడుపు లోపల మలేరియా పరాన్నజీవి ప్రారంభ దశలను గమనించి నప్పుడు తన పరిశోధనలో మొదటి ముఖ్యమైన అడుగు వేశాడు. 1896 జూన్‌లో ఆయనను సికింద్రాబాద్‌కు బదిలీ చేశారు. రెండు సంవత్సరాల పరిశోధన వైఫల్యం తరువాత, జూలై 1897 లో అతను సేకరించిన లార్వా నుండి 20 వయోజన "గోధుమ" దోమలను సంవర్ధనం చేయగలిగాడు. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రాన్ని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త సికింద్రాబాదు నగరంలో పరిశోధన చేస్తున్నప్పుడు 1897 ఆగస్టు 20న కనుగొన్నారు. తద్వారా ఆయనకు 1902లో నోబెల్ బహుమతి లభించింది. రోనాల్డ్‌రాస్.. మలేరియా పరాన్న జీవికి ప్లాస్మోడియం అని పేరు పెట్టారు. రొనాల్డ్ రాస్ భారతదేశం లోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అల్మోరాలో జన్మించాడు. ప్రస్తుతం "మినిస్టర్స్ రోడ్"గా పిలిచే రహదారిని 2000 సంవత్సరం వరకు "సర్ రోనాల్డ్ రాస్ రోడ్" అనేవారు.

మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలన కలుగుతుంది. మనుషుల్లో ఆడ అనోఫిలస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పరాన్నజీవిని కలిగివున్న దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ప్రపంచంలో ఏటా 500 మిలియన్ల జనాభా మలేరియా జ్వరాల బారిన పడి వారిలో 2.7 మిలియన్ల మంది మరణిస్తున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్లాస్మోడియం" అనే ప్రొటోజోవా పరాన్నజీవి మలేరియా వ్యాధి కారకము. ప్రోటోజోవాలు ఏకకణజీవులు. వీటి నిర్మాణము బ్యాక్టీరియా కంటే క్లిష్టమైనది. బ్యాక్టీరియా చాలా సులువయిన నిర్మాణము కలిగి ఉంటాయి. వివిధ ప్లాస్మోడియం స్పీసీస్లు మనుషులలో వివిధ రకాల మలేరియాలను కలుగజేస్తాయి. అందులో ప్లాస్మోడియం ఫాల్సిపారం, ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం మలేరియై, ప్లాస్మోడియం ఒవేల్, ప్లాస్మోడియం సెమీ ఒవేల్, ప్లాస్మోడియం నోవెస్లి ముఖ్యమైనవి.

దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ఎర్ర రక్తకణాలలో చేరిన 48 నుండి 72 గంటలలో ఈ పరాన్నజీవులు విభజన చెంది చిట్లిపోతాయి.దీనివలన ఫ్లూ, వణుకుతో కూడిన జ్వరం, అసాధారణ రక్తస్రావం, దీర్ఘ శ్వాస, రక్తలేమి చిహ్నాలు మరియు స్పృహ కోల్పోవడం జరుగుతుంది.చలి జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పిగా ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, వాంతులు, విరేచనాలు, నీరసంగా ఉండటం, ఆయాసం మొదలైనవి మలేరియా లక్షణాలు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తించడం వల్ల మెరుగైన చికిత్స అందించ వచ్చు. దోమకాటుకు గురైన ఏడు నుంచి 18 రోజుల మధ్య ఈ లక్షణాలు కనిపిస్తాయి. రక్త నమూనాలను సేకరించి మైక్రోస్కోపిక్ ల్యాబోరేటరీ టెస్టులు లేదా ఆర్డీటీ టెస్టుల ద్వారా మలేరియా వ్యాధిని నిర్ధారిస్తారు.

1946నుండి మలేరియా అదుపు చేయడానికి డి.డి.టి వినియోగం మొదలయ్యింది. 1953లో 7 కోట్ల పైగా ప్రజలు మలేరియా బారిన పడ్డారు. 8 లక్షల వరకు మరణాలు అందువలన సంభవించాయి. అప్పుడు 1958లో జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్లు రక్తపరీక్ష చేసి మలేరియా అని నిర్ధారిస్తారు. వ్యాధిగ్రస్తుని నుండి సేకరించిన రక్తం బొట్టును ఒక సన్నటి గాజు పలకపై ఉంచి, దానిపై గీంసా ద్రావకం వేస్తారు. దీనివలన డాక్టర్లు సూక్ష్మదర్శిని (మైక్రోస్కోపు) కింద మలేరియా జీవులను చూడ గలుగుతారు. మలేరియా బారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే.. వ్యాధి సోకకుండా జాగ్రత్త వహించడం మేలు. దోమలు ఉండకుండా చూసుకోవాలి. ఇందుకోసం పరిసరాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. మస్కిటో రిపెల్లెంట్స్ క్రీములు, స్ప్రేలు వాడటం ఉపకరిస్తుంది. ఘాటైన వాసనలను వెదజల్లే మొక్కలు, పుష్పాలను దోమలు ఇష్టపడవు. కాబట్టి బంతి రోస్‌మేరీ, పుదీనా మొక్కలను ఇంటి పరిసరాల్లో పెంచడం వల్ల దోమలు రాకుండా ఉంటాయి.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఎక్కువగా ద్రవాహారం తీసుకోవడం ముఖ్యం. తద్వారా రోగ నిరోధక వ్యవస్థ బలోపేతమై, రోగాల బారిన పడకుండా ఉంటాం. వీధుల్లో అమ్మే అపరిశుభ్ర ఆహారం తీసుకోవడం మానేయాలి.అధిక ప్రొటీన్లు ఉన్న పాలు పెరుగు, మజ్జిగ మలేరియా వ్యాధి ఉన్నవారు కణజాలాన్ని అధికంగా కోల్పోవడం వలన మలేరియా ఉన్నవారు తమ ఆహార ప్రణాళికలో ప్రొటీన్లను చేర్చుకోవాలి. అధిక ప్రోటీన్ మరియు అధిక చెక్కెరలు ఉన్న ఆహార పదార్థాలు కణజాల నిర్మాణానికి దోహద పడతాయి. అధిక ప్రొటీన్లు ఉన్న పాలు, పెరుగు, మజ్జిగ, చేపలు, లస్సీ, చికెన్ సూప్, గుడ్లు మొదలైనవి తీసుకోవాలి.

ఎలాక్ట్రోలైట్స్ మరియు నీటిని కోల్పోవడం మలేరియా వ్యాధి ఉన్నవారిలో సర్వ సామాన్యం. కనుక పండ్ల రసాలు, సూపులు, గంజి, కొబ్బరి నీరు, పప్పు నీరు మొదలైనవి తీసుకోవడం శ్రేయస్కరం. బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్ల విటమిన్ ఎ, విటమిన్ సి సమృద్ధిగా కలిగిన బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్లయిన నారింజ, బత్తాయి, ద్రాక్ష, అనాసపనస, నిమ్మ మొదలైన ఆహార పదార్థాలతో పాటు బి- కాంప్లెక్స్ విటమిన్లు తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# భూమి రక్షణ కవచాన్ని పరి రక్షించుకుందాం

## నేడు ఓజోన్ దినోత్సవం



భూమిని ప్రమాదకరమైన కిరణాల నుంచి కాపాడే రక్షణ కవచం ఓజోన్. మరి అలాంటి ఓజోన్‌కే రక్షణ లేకుండా పోతుండడం బాధాకరం. ఈ విషయం భవిష్యత్ తరాలను భయ పెడుతుండడం అత్యంత సహజం. ఓజోన్ పొర గురించి సైన్స్ విద్యార్థులకు చాలా బాగా తెలుసు. మిగిలిన వారికే దీని విలువ గురించి, దీని ప్రభావం గురించి తెలియక చాలా 'పొర'పాట్లు చేస్తున్నారు. వీటిపై అందరికీ అవగాహన కలిగించేందుకు, ఓజోన్ పొరను కాపాడు కోవడంతో పాటు ఇతర బలమైన కారణాల రీత్యా సెప్టెంబర్ 16వ తేదీని ఓజోన్ డే (ఓజోన్ దినోత్సవం)గా నిర్ణయించారు. ఇంతకీ ఓజోన్ పొర అంటే ఏమిటి.. దాన్ని ఎందుకు జాగ్రత్తగా కాపాడుకోవాలో తెలుసుకుందాం. భూమికి రక్షణ కవచంగా నిలిచేది 'ఓజోన్ పొర' అని సైంటిస్టులు తేల్చారు. ఈ భూమిపై జీవరాశి ఉండటానికి ప్రధాన కారణం ఓజోనే. ఇది భూమి చుట్టూ ఒక గొడుగులా ఆవరించి కవచంలా ఉండి మనల్ని కాపాడుతుంది. ఈ పొర గనుక లేకపోతే భూమి అగ్ని గుండంగా మారి ఉండేది. ఓజోన్ అనేది మూడు పరమాణువులతో కూడిన ఆక్సిజన్ అణువు (ట్రై అటామిక్ ఆక్సిజన్ మాలిక్యూర్). ఇందులో ఉన్న అన్ని ఆక్సిజన్ పరమాణువులు రసాయనికంగా ఒకే లక్షణం ఉన్నవి కావు. కానీ మనం శ్వాస క్రియలో పీల్చే సాధారణ ద్విపరమాణుక ఆక్సిజన్ అణువులో మాత్రం రెండు పరమాణువులు ఒకే విధమైనవి. భూవాతావరణాన్ని నేలమీద నుండి పైకి పోయేకొద్ది అక్కడున్న భౌతిక ధర్మాల ఆధారంగా వీటిని కొన్ని పొరలుగా విభజించారు. నేలకు దగ్గరగా 20 కిలోమీటర్ల లోపే ఉన్న పొరను "ట్రొపోస్పియర్" అని, 20 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్ల మధ్యన ఉన్న పొరను "స్ట్రాటో ఎక్సోస్పియర్ (స్ట్రాటో ఆవారణము) అని, ఆ తర్వాత "మీసో స్పియర్", "థర్మోస్పియర్", "ఎక్సోస్పియర్" అనే పొరలు సుమారు 5 వందల కిలో మీటర్ల వరకు వివిధ మార్గాల్లో విస్తరించి ఉన్నాయి. మన సాధారణ ఆక్సిజన్ అణువులు స్ట్రాటోస్పియర్లో ఓజోన్ అణువులుగా మారతాయి. ఇంత కీలకమైన పొరకు 1980లో రంధ్రం పడినట్లు సైంటిస్టులు గుర్తించారు. ఆ సమయంలోనే సూర్య కిరణాలు భూమి మీద నేరుగా తాకుతున్న విషయం బయట పడింది. అప్పటినుండి సైంటిస్టులు దీన్ని పరిరక్షించేందుకు సెప్టెంబర్ 16న దాదాపు 24 దేశాల ప్రతినిధులు మాంట్రియల్ నగరంలో సమావేశమై, ఓజోన్ పొర రక్షణ గురించి చర్చించారు. ఇందులో సుమారు 100 రకాల రసాయనాల వాడకాన్ని 2030 నాటికి అభివృద్ధి చెందిన, 2040 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పూర్తిగా అరికట్టడమే లక్ష్యం. 1987 సెప్టెంబర్ 16న మాంట్రియల్ ప్రొటోకోల్ పైన ప్రపంచ దేశాలు సంతకం చేశాయి. ఈ ఒప్పందంపై సంతకం చేసిన తేదీకి గుర్తుగా 'ఓజోన్ లేయర్ డే'ని నిర్వహించాలని తీర్మానించారు. భూమి మీద కాలుష్యం దెబ్బంటున్న కారణంగా ఓజోన్ పొరను పరిరక్షించడం లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి ఏటా సెప్టెంబర్ 16న 'ప్రపంచ ఓజోన్ పొర సంరక్షణ రోజు'గా పాటించాలని 1994లో ప్రకటించింది. సూర్యుని నుండి విడుదలయ్యే సూర్యరశ్మిలో అతినీల లోహిత కిరణాలను అడ్డుకుంటూ వాటి నుంచి భూమిపై ఉన్న జీవజాలాన్ని రక్షిస్తున్నదే ఓజోన్ పొర. ప్రోటో ఆవరణానికి కింద 15 నుంచి 50 కి.మీ మందంగా ఉండే పొరనే ఓజోను పొరగా పిలుస్తారు. ఇది అతినీల లోహిత కిరణాలను వడపోసి సూర్యరశ్మిని భూమిపైకి పంపుతుంది. ఇది భూమి చుట్టూ వేసి గొడుగులా ఆవరించి ఉండి, ఒక కవచంలా కాపాడుతుంది. ఇప్పుడు ఓజోను పొర మానవ తప్పిదాలకు కనుమరుగై పోతుంది.

అధిక ఇంధన వాడకం, మితి మీరిన రసాయనాలు ఉపయోగించడం, చెట్లు నరికి వేయడం, వంటి అంశాలు ఓజోన్ పొరను నాశనం చేస్తున్నాయి. ఈ ఓజోన్ పొర క్షీణత వల్ల మూలకణ మరియు పొలుసల కణ క్యాన్సర్లు, ప్రాణాంతక పుట్ట కురుపు, కంటి శుక్లాలు వంటి రోగాల బారిన ప్రజలు పడే అవకాశం ఉంది. కాలుష్య కారకాల నుండి ఓజోన్‌ను రక్షించేందుకు ఐక్యరాజ్య సమితి కొన్ని ప్రణాళికలు రూపొందించింది. దానినే మాంట్రియల్ ప్రొటోకోల్ అంటారు. స్ట్రాటోస్పియర్ పొరలో గాలిలోని ఆక్సిజన్ ($O_2$) అణువులు ఓజోన్ ($O_3$) అణువులుగా మారుతుంటాయి. అయితే ఆక్సిజన్ అణువులు ఓజోన్ అణువులుగా మారాలంటే అతి నీలలోహిత కిరణాలు కావాలి. సూర్యకాంతిలో దృశ్యకాంతి తో పాటు ఎంతో తీవ్రతతో అతినీల లోహిత కాంతి, పరారుణ కాంతి కూడా కలిసి ఉంటుంది. అయితే అందులో అతి నీలలోహిత కాంతి బాగా శక్తివంతమైంది. కాబట్టి జీవ జాతులకు ప్రమాద కరమైంది కూడా. అలాంటి ప్రమాదకర అతినీల లోహిత కాంతిని ఆక్సిజన్ అణువులు శోషించు కోవడం ద్వారా ఓజోన్ అణువులుగా మారతాయి. అంటే ఓజోన్ ఏర్పడ్డం వల్ల అతినీల లోహిత కాంతి భూమి వైపు చేరే మోతాదు గణనీయంగా తగ్గిపోతుంది. అదే సమయంలో ఓజోన్ కూడా తిరిగి ఆక్సిజన్‌గా వియోగం చెందుతుంది. అందుకోసం కూడా తన ఉద్దీపన కొరకై అతి నీలలోహిత కాంతి అవసరం; అంటే ఓజోన్ తయారీలో లాగానే దాని విఘటనంలో కూడా అతి నీలలోహిత కాంతి ఖర్చవుతుంది. అంటే సూర్యుని కాంతిలోని ప్రమాదకర అతినీల లోహిత కాంతిని ఓజోన్ తన ఉత్పత్తి ప్రక్రియలోనూ, తన విఘటన ప్రక్రియలోనూ ఉపయోగించు కుంటోందన్న మాట. మరో మాటలో చెప్పాలంటే ఓజోన్ ఉనికి భూమి మీద ఉన్న జీవ జాలానికి డాలు లేదా కవచంలాగా ఉపయోగపడ్తుంది.ఓజోన్ పొర తనకున్న సహజ మందాన్ని ఏదైనా కారణం వల్ల పోగొట్టుకొన్నా, లేదా పూర్తిగా వినాశనం చెందినా ఓజోన్ పొరకు చిల్లు ఏర్పడింది అంటాము. ఓజోన్ తరిగిపోయే క్రమంలో ఏర్పడేది ఆక్సిజన్ ($O_2$) అణువులు, ఆక్సిజన్ నవజాత (O) పరమాణువులు. ఇవి తిరిగి ఓజోన్‌గా మారగలవు. అయితే ఓజోన్ విఘటనం ఈ విధంగా కాకుండా ఇతర మార్గాల్లో ధ్వంసం అయితే $O_2$ అణువులు, O పరమాణువులు ఏర్పడవు.ఈ రోజుల్లో మనం తీసుకునే ప్రతీ నిర్ణయమూ ఓజోన్ పొరను దెబ్బ తీస్తోంది. భూతాపం పెరిగినా, వానలు కురవక పోయినా, అడవులు తగ్గిపోయినా, కాలుష్యం ఎక్కువైనా... ఇలాంటి అనర్థాలన్నీ ఓజోన్ పొరను దెబ్బతీసేవే. పాలపై మీగడలా... ఈ ఓజోన్ అనే వాయువు... సమస్యేమిటంటే... పెరుగుతున్న భూతాపం వల్ల నానాటికీ ఓజోన్ వాయువు తగ్గిపోతోంది. ఇలాగే పొర విచ్ఛిన్నం అవుతూ పోతే... కోట్ల మంది ప్రజలు, జంతువులు, పక్షులు, చెట్లు అన్నిటి పైనా వ్యతిరేక ప్రభావం పడుతుంది. చర్మంపై తీవ్రమైన సూర్య కిరణాలు పడి... కేన్సర్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు... పిల్లలు పుట్టే అవకాశాలు కూడా తగ్గిపోతాయి.ఓజోన్ పరరక్షణ కోసం... భూతాపాన్ని తగ్గించేందుకు వీలయ్యే అన్ని చర్యలూ చేపట్టాలి.పర్యావరణాన్ని రక్షించే చర్యలు తీసుకోవాలి. చెట్లు నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం బలమైన చట్టాలు తేవాలి. అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాళ్లూ నిర్మించేటప్పుడే... 33 శాతం మొక్కలు, చెట్లు పెంచేందుకు స్థలం ఉండేలా నిబంధనలు తేవాలి. సంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచడం ద్వారా... భూతాపాన్ని తగ్గిస్తూ... ఓజోన్ పొరను కాపాడేందుకు వీలవుతుంది.

# సంగీత ఝురి..స్వరామృత ధార.. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి

## నేడు ఆమె జయంతి



కర్ణాటక సంగీత ఝురి..ఎన్నటికీ వాడని మల్లెల సౌరభ సంగీత సుగంధం..ఎం.ఎస్.సుబ్బులక్ష్మి. సూర్యచంద్రులు ఉన్నంత వరకూ ఆమె సంగీతం అలరారుతుంది. 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పేరుగాంచిన మదురై షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి. ప్రముక కర్ణాటక సంగీత విద్వాంసురాలు, గాయని, నటి. భారతదేశ అత్యున్నత పౌరపురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సంగీత కళాకారిణి, ఆసియా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించే రామన్ మెగసెసే పురస్కారం పొందిన తొలి భారతీయ సంగీత కళాకారిణి ఎం.ఎస్ సుబ్బులక్ష్మి. 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి ఎం.ఎస్.గా పేరుగాంచిన మదురై షణ్ముఖ వడివు సుబ్బులక్ష్మి కర్ణాటక సంగీత విద్వాంసురాలు, గాయని, నటి. ఆమె భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్ట మొదటి సంగీత కళాకారిణి. ఆసియా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించే రామన్ మెగసెసే పురస్కారం పొందిన తొలి భారతీయ సంగీత కళాకారిణి. తన జీవిత కాలంలో సంగీత ప్రపంచంలో బహుశా ఎవరూ సాధించని రికార్డులు, రివార్డులు ఆమె పాదాక్రాంత మయినాయి. ఆమె సంగీత ప్రపంచంలో ఎక్కని 'శిఖరం లేదు, పొందని బహుమానం లేదు. అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఎన్నో సుబ్బులక్ష్మి గాత్రానికి దాసోహ మంటూ ఆమె ముందు వాలాయి. తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో న్యాయవాది సుబ్రహ్మణ్య అయ్యర్, వీణావాద్య విద్యాంసురాలు షణ్ముఖవడివు అమ్మాళ్ కు 1916 సెప్టెంబర్ 16 న జన్మించింది. చిన్నప్పుడు ఆమెను ముద్దుగా కుంజమ్మ అని పిలిచేవారు. తల్లి ఆమె తొలి గురువుగా 10 ఏళ్ళ ప్రాయం నుంచే సంగీత ప్రస్థానం ప్రారంభమైంది. సుబ్బులక్ష్మి శుద్ధ సంప్రదాయ కుటుంబంలో జన్మించి, భారతీయ సంప్రదాయాన్ని, సంస్కారాన్ని అమితంగా ప్రేమించింది. చదువు మానేసి అక్క, అన్నదమ్ములతో కలసి సంగీత సాధన చేసి, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద సంగీతంలో శిక్షణ పొంది తన ప్రతిభకు స్పష్టమైన రూపునిచ్చి, తదనంతర కాలంలో జాతి గర్వించతగ్గ అంతర్జాతీయ సంగీత సామ్రాజ్ఞిగా ఎదిగింది. 1926 లో 10 సంవత్సరాల వయసులో గుడిలో పాటలు పాడడంతో తన తొలి సంగీత ప్రదర్శన మొదలైంది. నాటి నుండి సంగీత ప్రియులను తన మధుర స్వరంతో సంగీతంలో ఓలలాడిస్తూనే ఉంది. అప్పుడే తను మొట్టమొదటి సారిగా హెచ్.ఎం.వి కోసం ఆల్బమ్ అందించింది. సుబ్బులక్ష్మిలోని ప్రతిభను గుర్తించిన తల్లి మధురై నుంచి చెన్నైకి మకాం మార్చటంతో ఆమె జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ఆమె 1933 లో మద్రాస్ సంగీత అకాడెమీలో తన మొట్ట మొదటి సంగీత కచేరీకి శ్రీకారం చుట్టింది. ఆనంద వికటన్ పత్రిక సీనియర్ ఎగ్జిక్యూటివ్, స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది అయిన త్యాగరాజన్ సదాశివన్ తో 1940 లో ఆమె ప్రేమవివాహం అయింది. 1938 సంవత్సరంలో "సేవా సదనం" సినిమా ద్వారా సుబ్బులక్ష్మి సినీ సంగీత ప్రపంచంలో అడుగు పెట్టింది. తమిళ సినిమాలలో గాయనిగా తెరపై కూడా కనిపించి ప్రేక్షకులను అలరించింది. 1940 వ సంవత్సరంలో "శకుంతలై" అన్న తమిళ సినిమాలో ఆమె తొలిసారిగా గాయక నటిగా తెరపై కనిపించింది. 1945 వ సంవత్సరంలో నిర్మించ బడిన 'మీరా' చిత్రం హిందీలో పునర్నిర్మించ బడి కూడా విజయవంతం కావడంతో సుబ్బులక్ష్మి పేరు భారతదేశ మంతటికీ సుపరిచిత మయింది. 'మీరా' సినిమాలోని ఆమె నటనకు, గాన మాధుర్యానికి జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు లభించాయి. అది ఆమె ఆఖరి సినిమా.

నుదుటి మీద ఎర్రటి కుంకుమ బొట్టు, చేతుల నిండా గాజులు, కళ్లకు నిండుగా కాటుక, కొప్పు నిండా మల్లెపూలు, చేతిలో తంబూర పట్టుకొని నిండైన విగ్రహంతో, భారతీయతకు ప్రతీకగా ఒంటినిండా పట్టుచీరతో

సంగీత కచేరీ ప్రారంభించగానే శ్రోతలు ఆమె గాన లహరిలో మునిగిపోయే వారు. కర్ణాటక గానం ధ్యానంలా సాగేది. సుబ్బు లక్ష్మి పాడుతుంటే స్వయంగా అమ్మవారే పాడుతున్నట్లు భావించేవారు. పదికి పైగా భాషల్లో ఎన్నో కృతులను, కీర్తనలును, శాస్త్రీయ, లలిత గీతాలను, భజనలు, జానపద గేయాలు, మరాఠీలో అభంగాలు, దేశభక్తి గేయాలు కూడా పాడారు. ఏ భాషలో పాడినా అదే తన మాతృభాష అన్నట్లుగా స్పష్టమైన భాషా నుడికారంతో భావయుక్తంగా ఆలపించడం సుబ్బులక్ష్మి ప్రత్యేకత. శృతి, లయ, ఆలపనతో పాటు భావాన్ని, భక్తిని సమ పాళ్ళలో వ్యక్తీకరించడంతో పాటు పామరులను సైతం శాస్త్రీయ సంగీతంతో మెప్పించడం ఆమెకు మాత్రమే సాధ్యం. సంక్లిష్ట సమాసాలతో కూడిన సంస్కృత భాషలోని భావం దెబ్బతినకుండా అలవోకగా ఆలపించడం ఆమె సాధన ద్వారా సాధించుకున్న గొప్ప వరం. త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి వంటి సంగీత దిగ్గజాలు రూపొందించిన గీతాలకు సుబ్బులక్ష్మి తన గాత్రం ద్వారా ప్రాణం పోశారు.

మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన "వైష్ణవ జనతో, తేనె కహెరే, జో పీర్ పరాయీ జానేరే" వంటి గీతాలకు ప్రాణం పోసిన వ్యక్తి ఆమె. గాంధీజీ ప్రార్థన సమయములో ఆ పాటను పాడించు చుకునే వారు. భజనను మొక్కుబడిగా పాడటం వేరు, అలా పాడుతూ పూర్తిగా దైవ చింతనలో లీనమవడం వేరు అని మహాత్మా గాంధీ ఆమెను ప్రశంసించారు.

ఐక్య రాజ్య సమితిలో పాడిన గాయనిగా చరిత్ర సృష్టించారు సుబ్బలక్ష్మి. ఆ సందర్భంలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక సుబ్బులక్ష్మిని ప్రశంసిస్తూ తన సంగీతంతో సందేశాన్ని వినిపించగల సమర్థురాలిగా పేర్కొన్నాయి. రాయల్ ఆల్బర్ట్ హాల్, లండన్లో ప్రదర్శన యిచ్చినపుడు ఇంగ్లండ్ రాణిని కూడా తన్మయురాలిని చేసి ఆమె ప్రశంసలు పొందింది.భారత ప్రభుత్వం1954పద్మభూషణ్ బిరుదు, సంగీత కళానిధి ది మ్యూజిక్ అకాడమి చెన్నై, తమిళనాడు 1965మొట్ట మొదటి సారిగా అందుకున్న గాయకురాలు.

డాక్టరేట్ శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ఆంధ్రప్రదేశ్1971, డాక్టరేట్ ఢిల్లీ యూనివర్సిటి ఢిల్లీ1974, రామన్ మెగసెసే పురస్కారం, ఫిలిప్పీన్స్ ప్రభుత్వం1974,పద్మ విభూషణ్ భారత ప్రభుత్వం1975, డాక్టరేట్ బెనారస్ యూనివర్సిటి ఉత్తర ప్రదేశ్1980, డాక్టరేట్ యూనివర్సిటి ఆఫ్ మద్రాస్ తమిళనాడు1987, కాళీదాస్ సన్మాన్ మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1988, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా అవార్డులాంటివి ఎన్నో ఆమెను వరించాయి. అత్యున్నత పురస్కారం భారతరత్నను1998లో మొట్టమొదటి సారిగా అందుకుని చరిత్ర సృష్టించిన స్త్రీ.జీవిత సాఫల్య పురస్కారంఢిల్లీ ప్రభుత్వం2004 ఎం.ఎస్.సుబ్బులక్ష్మి తనకు పురస్కారం క్రింద వచ్చిన 11 లక్షల రూపాయల నగదును స్వర్గీయ కంచి ఆచార్య చంద్ర శేఖరేంద్ర సరస్వతీ స్మృతి కట్టడానికి విరాళ మిచ్చారు.ఇంటింటా పవిత్ర సుమ సుగంధాలను వెదజల్లిన 'సుప్రభాత' గీతమై ప్రతి ఇంటా ఆధ్యాత్మిక భావనలను విరజిమ్మిన విష్ణు సహస్రనామ నిత్యస్తోత్రమై ఈ ధరణీతలాన్ని కొన్ని దశాబ్దాల పాటు పులకింప చేసిన కర్ణాటక శాస్త్రీయ సంగీత స్వరధార 2004, డిసెంబర్ 11న శాశ్వతంగా మూగబోయింది. కాని ఆమె గొంతు మాత్రం విశ్వం ఉన్నంత కాలం ప్రపంచం అంతా మారు మోగుతూనే ఉంటుంది. ఈ మధుర గాంధర్వ కళాకారణి ఎం.ఎస్ సుబ్బులక్ష్మి. ఆమె ఆహార్యం ఎన్నటికీ మరువరానిది. నుదుటిని కుంకుమతో.. తలలో ఎప్పుడూ మల్లెపూలతో గొంతెత్తి పాడుతున్న ఆమె ఆహార్యం భారతీయుల గుండెల్లో చిరకాలం నిలిచిపోతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలి

○ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాలో జరుగు గణపతి నిమజ్జనం సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారి నియమాలు కచ్చితంగా పాటించాలని అన్నారు. అధిక సౌండ్ నిచ్చే డీజేలు, పట్టనివ్వద్దని, బాణాసంచా కాల్చడం వంటివి చేయకుండా చూడాలన్నారు. విగ్రహాలను తీసుకువెళ్లే వాహనాలపై మద్యం మత్తులో ఉన్నవారిని అనుమతించకూడదని అన్నారు. రెచ్చగొట్టే నినాదాలు చేయడం, మత స్థలాల దగ్గర ఊరేగింపులను ఆపడం వంటివి చేయరాదన్నారు. కనుల పండుగగా జరుగు గణేష్ నిమజ్జన యాత్రను ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో జరపాలని ఎవరు కూడా ఇతర భక్తులకు కానీ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించరాదని ఆయన తెలిపారు. ప్రతి విగ్రహం నిమర్జనం వీలైనంత త్వరగా బయలుదేరాలని, వాహనాలపై పరిమితికి మించి భక్తులు వెళ్లకూడదని తెలిపారు. ఊరేగింపు సమయంలో కరెంటు తీగలను గమనించి వాహనాన్ని నడపాలి. నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లేటప్పుడు రోడ్లను పూర్తిగా బ్లాక్ చేయకూడదన్నారు. వాహనాలకు తగిన దారి ఉండేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు శాంతియుతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకునేందుకు ముందస్తు ప్రణాళికతో పోలీస్ అధికారులు అన్ని శాఖల అధికారులతో కలిసి పనిచేయాలని సూచించారు. ప్రధానంగా గణేష్ నిమజ్జనం రూట్లో సి.సి కెమెరాల ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కెమెరాలు పూర్తిగా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేయడం జరిగిందని ఈ సి.సి టివిలు 24×7 ప్రకారంగా పూర్తిగా సిబ్బంది పర్యవేక్షణలో ఉంటయని తెలిపారు. నిమజ్జనం రోజు ఆయా రూట్లలో విద్యుత్ శాఖ, ఆర్ అండ్‌బీ శాఖల మరియు ఇతర శాఖల సమన్వయంతో నిమజ్జనోత్సవం సాఫీగా సాగేలా చర్యలు చేపట్టామనీ. గణేష్ నిమజ్జనం చేయుటకు భద్రతాపరమైన పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ తెలిపారు.




## ముత్యాలమ్మ కాలనీలో అన్న ప్రసాద వితరణ



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండలకేంద్రంలోని ముత్యాలమ్మ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్సై జగన్ హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పర్యావరణానికి హానీ కలగకుండా మట్టి గణపతిని ప్రతిష్టిస్తూ.. పూజలు నిర్వహించడం అందరికీ ఆదర్శం అన్నారు. ప్రజలంతా మట్టి గణపతులను ప్రతిష్టించి మానవ మనుగడకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ కాలనీ గణపతి మండప కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సూర్య నమస్కారాల గ్రూప్‌కు టీ షర్ట్స్ అందజేత




**విశ్వంభర, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సూర్య నమస్కారాల గ్రూప్ సభ్యులకు ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త కల్లూరు అశోక్ గుప్త ఆధ్వర్యంలో టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో అశోక్ గుప్తాకు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం గ్రూపు సభ్యులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని మిత్రులు అందరం కలిసి గజ్వేల్ లో సూర్య నమస్కారం గ్రూప్ ఏర్పాటు చేసుకుని ప్రతిరోజు ఉదయం ఐదున్నర గంటలకు అంతా ఒక చోటుకు చేరుకొని వ్యాయామం చేయడం జరుగుతుందని, మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని, ప్రతి ఒక్కరూ వ్యాయామం, నడక అలవర్చుకోవాలని అన్నారు.

## ప్రధానోపాధ్యాయుడు ఆవుల రవికి ఘన సన్మానం




**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం తను చేసిన సేవలను గుర్తించి లయన్స్ క్లబ్ వారు సన్మానించడం సంతోషంగా ఉందని, ఈ సన్మానం తనపై మరింత బాధ్యతను పెంచిందని విట్యాల గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆకుల రవి అన్నారు. ఆచార్యదేవోభవ లో భాగంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారిచే విట్యాల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆవుల రవికి ఘనంగా సన్మానం చేశారు. గత సంవత్సరంలో పాఠశాలలో చేసిన వినూత్న కార్యక్రమాలైన పాఠశాలలో మొక్కలు నాటడం, బంకమట్టిలో వినాయకుడిని చేయించడం, తరుచు పాఠశాలకు రాని విద్యార్థుల ఇంటికి వెళ్లడం, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను క్రమబద్ధీకరించడం, ఎన్ఎంఎంఎస్ లాంటి పోటీ పరిక్షలకు 8వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, శిక్షణలో భాగంగా గతేడాది తమ పాఠశాల ఎనిమిదవ తరగతికి చెందిన రాధిక ఎంపిక కావడం, విద్యార్థులందరికీ ఆశ వర్కర్లచే నెలలో రెండు సార్లు ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, 2023 లో ఎస్ఎస్‌సీ ఫలితాలు నూరు శాతం సాధించడం, అలాగే 2023 ఎస్ఎస్‌సీ ఫలితాలలో మండలంలో తమ పాఠశాలను 6వ స్థానంలో నిలపడం, మండల స్థాయిలో జరిగే అన్ని పోటీలకు విద్యార్థులను తీసుకెళ్లడం, ప్రతి శనివారం విద్యార్థులకు ప్రేరణ తరగతుల నిర్వహణ, మానసిక ప్రశాంతతకు యోగా, పిల్లలో ప్రతిభా పాటవాలను వెలికి తీసెందుకు బాలసభ నిర్వహణ, హైదరాబాద్ లో జరిగిన అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ కు 40 మంది పిల్లల్ని తీసుకెళ్ళడం, ఎఫ్‌సీఎన్ వంటి సంస్థలచే ప్రతి సంవత్సరం బెస్ట్ లెక్చరులు ఇప్పించడం, మోటివేషన్ క్లాసులు నిర్వహించడం, ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేయడం లాంటి కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకొని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ప్రధానోపాధ్యాయుడు ఆకుల రవిని ఘనంగా సన్మానించారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాశం నరేష్ రెడ్డి తండ్రి పాశం నర్సింహా రెడ్డి అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ జన్నాయి కోడె నగేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి మృతుడు పాశం నర్సింహా రెడ్డి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య స్ఫూర్తితో మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ వారి కుటుంబానికి ఐదు రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మెన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం, పాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ లు మురారిశెట్టి మల్లేశం, లోడి రాములు, నాయకులు ఎద్దు వెంకటేశ్వర్లు, పినింటి మోహన్ రెడ్డి, పైళ్ల బుచ్చి రెడ్డి, బూరెడ్డి మల్లా రెడ్డి, పాశం సత్తి రెడ్డి, వెంకట్ రెడ్డి, యాస వెంకట్ రెడ్డి, పాశం అనంత రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లోడి శ్రీశైలం, రంగ శ్రీను, కోరే కనకయ్య, దొంతరబోయిన భాస్కర్, ఎలగందుల సైదులు, కోరే మల్లేశం, రాగటి సత్యనారాయణ, కొంగరి పరుషరాం, మొల్గూరి సత్యనారాయణ, కరుణాకర్, కల్వల నరేష్, పంజాల మధు, మల్ల గణేష్, చిత్తర్ల అనిల్, తొండల అనిల్, రాచమల్ల ప్రసాద్, లోడి మహేష్, కోరే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మరెడ్డి నర్మద రెడ్డికి ఘన నివాళి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన ఎన్ వి ఆర్ నేటి సామాన్యుడు దిన పత్రిక చైర్మన్ నిమ్మరెడ్డి వెంకట్ రెడ్డి సతీమణి, డైరెక్టర్ స్వర్గీయ నిమ్మరెడ్డి నర్మద రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు మాట్లాడుతూ నిమ్మరెడ్డి నర్మదరెడ్డి అకాల మరణం చెందడం చాలా బాధాకరమని అన్నారు . తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు, న్యూస్ కరస్పాండెంట్ గుర్రం మల్లేష్ మాట్లాడుతూ నర్మద రెడ్డి అకాల మరణం అటు కుటుంబ సభ్యులకు, ఇటు దిన పత్రిక కి పెద్ద దిక్కు కోల్పోయామని అన్నారు. బ్యూరో చీఫ్ నజీర్ ఖాన్ మాట్లాడుతూ మంచి తనం, మానవత్వానికి నిండు రూపం నర్మద రెడ్డి అని అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మహిళా విభాగం మండల కన్వీనర్ దంతూరి సుమలత గౌడ్ మాట్లాడుతూ ఆమె ఆశీస్సులు పిల్లల మీద ఎప్పుడూ ఉండాలని ఇలాంటి వ్యక్తులు




చాలా తక్కువగా పుడుతారని మర్యాదకి మరో పదం నర్మద రెడ్డి అని కొనియాడారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు , టవల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీ జే యూ మండల అధ్యక్షులు నాగరాజు, మండల ఉపాధ్యక్షులు అజీజ్, మండల కార్యదర్శి సతీష్ గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుమలత గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ శోభాయాత్రకు పటిష్ట చర్యలు : ఎస్పీ కిరణ్ ఖరే

**విశ్వంభర, భూపాలపల్లి :** గణేష్ శోభాయాత్ర భూపాలపల్లి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరగాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టామని, గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, పోలీసుల సూచనలను పాటించాలని ఎస్పీ తెలిపారు. గణేష్ నవరాత్రులు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయనీ, అలాగే గణేష్ శోభాయాత్ర , గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రజలు సంతోషకరమైన ఆరోగ్యకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఇప్పటికే పోలీసు శాఖ 300 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తుందని, గణేష్ నిమజ్జనం శోభయాత్ర ప్రశాంతంగా, శాంతియుతంగా జరిగేలా పగడ్బందీ చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిమజ్జనం చేసే చెరువులు, కుంటలు, నదుల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గణేష్ ఊరేగింపు




సమయంలో గ్రామాల్లో విద్యుత్ తీగల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## వినాయక శోభాయాత్రకు సర్వం సిద్ధం



**విశ్వంభర, మహబూబాబాద్ :** నిజాం చెరువులో రేపు జరిగే గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్,ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రేపు జరగబోయే గణేష్ ఉత్సవ శోభాయాత్ర, నిమజ్జనం, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్, శాంతి భద్రతల సమస్య రాకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికలతో ఉన్నారని, షెడ్యూల్ ప్రకారం గణేష్ నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేయుటకు సిబ్బంది అందరూ వారికి కేటాయించిన విధులను నిర్వహించాలని ఆదేశించారు. చెరువు వద్ద గజఈత గాళ్లను, లైఫ్ జాకెట్లు, బోట్లు సిద్ధంగా ఉంచామన్నారు. మున్సిపల్ పరిధి, గ్రామాలలో సూచించిన చెరువులలో మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు. పోలీస్,మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, తదితర శాఖలు కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్, డీఎస్పీ తిరుపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్న, మున్సిపల్ కమిషనర్ రవీందర్, మున్సిపల్ డిఈ ఉపేందర్, స్థానిక తహసిల్దార్ భగవాన్ రెడ్డి, విద్యుత్ డిఈ విజయ్, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలి

**విశ్వంభర, కొత్తూరు:** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ వినాయక మండపాలని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి ,అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయన్నారు. గణేష్ నవరాత్రి మహోత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయని, వినాయక మండపాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటున్నదని, పూజలు, అన్నదాన కార్యక్రమాలతో మండపాలు కళకళలాడుతున్నాయని అన్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేటట్లు దీవించాలని కోరుకున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ మాదారం నరసింహ గౌడ్, కోస్గి శ్రీనివాస్, సోమ్లా నాయక్, అనిత శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పెంట నోళ్ళ యాదగిరి, మొగ్ర జనార్దన్ రెడ్డి, డ్రైవర్ లక్ష్మణ్,నాట్కో విష్ణు, బాలు, రాజు, రూప్ సింగ్ పాల్గొన్నారు.



## ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ రణవేణి సుజాత



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి రణవేణి సుజాత సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టి మోహన్ మెట్ పల్లి పట్టణంలోని వట్టి వాగువద్ద సోమవారం నిమజ్జనం ఉన్నందున సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. చైర్ పర్సన్ రణవీని సుజాత సత్యనారాయణ మాట్లాడుతూ సోమవారం నిమజ్జనం సందర్భంగా వట్టి వాగు దగ్గర సిసి కెమెరాలు, లైటింగ్, జనరేటర్, వాగులో నీటి స్టోరేజ్ కొరకు కట్ట వేయడం జరుగుతుందని రెండు క్రేన్లు ఒక చైన్ మిషిన్ వట్టి వాగు చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గణేష్ నిమజ్జనంకు వచ్చే భక్తులు సకాలంలో వచ్చి నిమజ్జనం చేసి వెళ్ళాలని తెలిపారు. గణేష్ నిమజ్జనం సందర్భముగా మెట్ పల్లి పట్టణ ప్రజలకు గణేష్ మండపాల నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ నాగేశ్వరరావు, ఏఈ తిరుపతి, పిఓ రాజేంద్రప్రసాద్, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నిజాం, మహేష్, శేఖర్ లింబయ్య పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి సన్మానం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డిని సత్కరించిన ఐఎన్టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ ఐఎన్టీయూసీ యాదాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకానికి సహకరించినందుకు యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఐఎన్టీయూసీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ శ్రీకాంత్, ఓబీసీ పట్టణ అధ్యక్షులు పొరల్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మజ్జనం సందర్బంగా ట్రాఫిక్ ఆంక్షలు

**విశ్వంభర, కామారెడ్డి :** కామారెడ్డి కామారెడ్డి పట్టణంలోని 16, 17వ తేదీలలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి పట్టణంలో సిరిసిల్ల రోడ్డు స్టేషన్ రోడ్డు సుభాష్ రోడ్ జే ప్రకాష్ నారాయణ గౌడ్ పెద్ద బజార్ రోడ్ ఏరియాలో రెండు రోజులు ఉంటాయని అన్నారు. ప్రజలు దీనిని గమనించాలని పట్టణ ప్రజలకు తెలియజేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, వెల్దండ :** వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వేమల జంగమ్మ కుటుంబానికి మండల గౌడ సంక్షేమ సంఘం గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో పదివేల రూపాయల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజిగౌడ్ ,మండల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ , మదన్ గౌడ్, విష్ణు గౌడ్, భరత్ గౌడ్,వేముల బాలయ్య, వేముల వెంకటయ్య, వేమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ & బీ ఈఈకి సన్మానం

**విశ్వంభర, మహబూబాబాద్:** ఆదివారం జాతీయ ఇంజినీర్ ల దినోత్సవం సందర్బంగా మహబూబాబాద్ ఆర్&బి ఈఈ భీమ్లా ని పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన మహబూబాబాద్ లయన్స్ క్లబ్ సభ్యులు. ఈ కార్యక్రమం లో మహబూబాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు యాళ్ల మురళీధర్ రెడ్డి, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ రామ సహాయం వెంకట్ రెడ్డి, కార్యదర్శి అశోక్ రెడ్డి, పివి ప్రసాద్, బవిరిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాయుధ పోరాటం పట్ల

# వాస్తవాలను గ్రహించి మాట్లాడండి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్ధుల జంగయ్య



**విశ్వంభర, రంగారెడ్డి:** కొందుర్గు మండల పరిధిలోని రామచంద్రాపూర్ అంగడి బజారు మహిళా సమైక్య బిల్డింగులో తెలంగాణ 76వ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ కొందుర్గు మండల కార్యదర్శి భాగాల నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు బుద్ధుల జంగయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దున్నే వాడిదే భూమి కావాలని తెలంగాణ సాయుధ పోరాటం కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మొయినోదీన్ నాయకత్వంలో పెద్ద ఎత్తున రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. వేలాది మంది చిన్న సన్నకారు రైతులు భూ పోరాటంలో పాల్గొని ఎర్రజెండాలు పాతి వేలాది లక్షలాది ఎకరాల భూమిని ఆక్రమించుకొని సాగు చేయడం జరిగింది. తెలంగాణ నవాబ్ తొత్తులు జాగీర్దారులు, జమీందారు సాయుధులు, రైతులను అతి కిరాతకంగా చంపడం జరిగింది అని బుద్ధుల జంగయ్య తెలిపారు. అయినా పోరాటంలో వెనుకంజ వేయక ప్రాణాలు పోయిన పరవాలేదని చాకలి ఐలమ్మ, దొండు కొమురయ్య, షేక్ బందగి లాంటి అనేకమంది వీరులు ప్రాణ త్యాగం చేయడం జరిగింది. విష్ణు నూరి, రామచంద్ర రెడ్డి గడిలను కూల్చింది తెలంగాణ సాయుధ పోరాటమని ఆయన కొనియాడారు. ఇలాంటి మహోన్నత గల చరిత్రను సృష్టించిన పోరాటాన్ని మతోన్మాదులు బీజేపీ వాళ్లు వక్రీకరించి నేడు విమోచన దినమని అనడం సిగ్గుచేటు అని ఆయన అన్నారు. ఆ పోరాట ఫలితమే చాలామందికి పేదలకు అసైన్మెంటు చట్ట ప్రకారం భూ పంపిణీ తెలంగాణ పేదలైన సబ్బండ కులాల ప్రజలకు నేడు ప్రభుత్వ భూములు దున్నుకుంటున్నారంటే అది తెలంగాణ సాయుధ ఎర్ర జెండా పోరాట ఫలితంగా జరిగింది అని తెలిపారు. తెలంగాణ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17న వీలిన దినంగా ప్రకటిస్తామని చెప్పి మాట తప్పి తప్పించుకున్నారు. కనీసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అన్న సెప్టెంబర్ 17న వీలిన దినంగా ప్రకటించి అధికారికంగా జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చౌదర్ గూడా మండల కార్యదర్శి జి వెంకటేష్, ఏఐటియుసి రెండు మండలాల కార్యదర్శులు బాలరాజ్, సి సురేష్, సీనియర్ నాయకులు యామిని బాలకృష్ణయ్య, బికేఎంయు జిల్లా ఉపాధ్యక్షులు ఎం కృష్ణ, నాయకులు వెంకటయ్య, పెంటయ్య, కిష్టయ్య రామచంద్రయ్య జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉన్న ఎస్టి బాయ్స్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటూ వారికి మధ్యాహ్న భోజనం పెట్టడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు విద్యార్థులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం లాగా కాకుండా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్ లో చదువుకునే విద్యార్థులకు సంబంధించి పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేసారు. దాంతోపాటు పెండింగ్లో ఉన్నటువంటి డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెస్ కాస్మోటిక్ చార్జీలు పెరిగిన ధరలకు అనుకూలంగా రాకపోవడం వల్ల హాస్టల్స్ లో ఉన్నటువంటి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి హాస్టల్ వార్డెన్స్ కి ఇబ్బందికరంగా మారిందని అన్నారు. తక్షణమే సంక్షేమ రంగంపై ప్రభుత్వం దృష్టి సాధించి హాస్టల్ లో చదువుకునే విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలతో పాటు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆయన అన్నారు. విద్యార్థుల సమస్యలు తీర్చకపోతే భవిష్యత్తులో సంక్షేమ హాస్టల్స్ లో చదువుకున్న విద్యార్థులతో పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

### ఎస్పీ అశోక్ కుమార్



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి సర్కిల్ పరిధిలో ఈనెల 16 17న జరిగే వినాయక నిమజ్జనం కు సర్వం సిద్ధం చేశామని డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై చిరంజీవి రాజు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మొదలు పెట్టి రాత్రి 11 గంటలకు ముగించాలని, డీజే నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ సౌండ్ బాక్స్ లు ఇవ్వవద్దు ఒకవేళ ఇస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. అలాగే మద్యం వైన్స్ షాపులు మూసివేయాలి నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం, గ్రామాల్లో ఎక్కడైనా మద్యం అమ్మితే తీవ్రమైన చర్యలు ఉంటాయి, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. దాదాపు 100 సీసీ కెమెరాలు అమర్చబడినవి పోలీసు నిఘానేత్రం ప్రతి ఒక్కరిని పర్యవేక్షిస్తుంది 150 మంది పోలీసులు 50 మంది స్పెషల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని అన్నారు. మెట్ పల్లి వట్టి వాగు నుండి పాత బస్టాండ్ మీదుగా అయ్యప్ప గుడి వరకు వన్ వే ట్రాఫిక్ ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు చెప్పిన విధంగా ప్రజలు సంయామ నం పాటించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహకరించగలరని, నిమజ్జనం ఉత్సవం ప్రారంభ స్థలం నుండి నిమజ్జనం జరిగే స్థలం వరకు ఇరువైపులా షాపులు మూసివేయాలని వ్యాపారస్తులను కోరారు. ఇట్టి బందోబస్తు మెట్ పల్లి డీ.ఎస్.పీ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో జరుగుతుందని సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# నిమజ్జన ఏర్పాట్లు పూర్తి



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా వినాయక చవితి నవ రాత్రి ఉత్సవాలను భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పల్లె, పట్టణాల్లో భక్తి పారవశ్యంతో ఆదిదేవుడిని పూజించారు. నవరాత్రి ఉత్సవాలు ముగియనుండడంతో సోమ, మంగళవారం భూపాలపల్లి జిల్లాలో వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు జరగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచే కాక వరంగల్, ములుగు వంటి దూర ప్రాంతాల నుండి కాళేశ్వరం గోదావరి లో నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆదివారం నిమజ్జన పర్యవేక్షణ ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏటా కాళేశ్వరం వద్ద నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యాన భక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ నిమజ్జన ఉత్సవాలను ఆనందంగా ముగించేలా అధికారులకు, పోలీసులకు సహకరించాలని సూచించారు. పర్యవేక్షణకు జిల్లా అధికారులకు విధులు కేటాయించినట్లు తెలిపారు. తగు జాగ్రత్తలు పాటిస్తే గణనాధుని నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవచ్చని పేర్కొన్నారు. విగ్రహాలను యంత్రాంగం నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో నిమజ్జన పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటికి జడ్పీటీసీ నిధులు మంజూరు



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలంలోని పెద్దూర్ తాండ లో త్రాగు నీటి సమస్య ఉండడంతో తండా ప్రజల ఇబ్బంది గురించి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ , తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ పదవిలో ఉన్న సమయంలో గ్రామపంచాయతీలో త్రాగు నీటి సమస్య ఆయన దృష్టికి తీసుకు వెళ్లడంతో త్రాగు నీటి కోసం బోరు మరియు మోటరు కోసం జడ్పీటీసీ నిధులు రెండు లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులు ఇప్పుడు రావడంతో వాటి ప్రొసీడింగ్ కాపీలను కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవుని పడకల్(పెద్దూర్ ) మాజీ యంపీటీసీ మూడవత్ రఘు నాయక్, మాజీ సర్పంచ్ మూడవత్, సక్రి, కిషన్ మాజీ వార్డు మెంబర్లు కేతావత్ శ్రీను, మూడవత్ రవి, టిక్యి, మోత్యి కిషన్, జాను, బాలు, రవి, తావు బీల్యి, రవి, కేతావత్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నంది గణపతి మండపం వద్ద అన్నదానం



**విశ్వంభర భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లక్ష్మారెడ్డి పల్లి గ్రామంలో వినాయక నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని శ్రీ రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నంది గణపతికి ఘనంగా పూజలు చేశారు గ్రామస్తులు. అనంతరం ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపురం ఎస్ ఐ అశోక్ పాల్గొని అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక స్వామి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామంలోని ప్రతీ కుటుంబం దినదిన అభివృద్ధి సాధించాలని నంది గణపతి స్వామి వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ ఒద్దుల విజయ అశోక్ రెడ్డి, ఏక్కటి శ్యామల రెడ్డి, విరమళ్ళ వీరారెడ్డి, సంపత్ రెడ్డి, విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాబునాయక్ తండాలో ఉచిత వైద్య శిబిరం

**విశ్వంభర, మహబూబాబాద్:** బాబునాయక్ తండాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన సర్వేంద్రియానం నయనం ప్రధానం శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించింది. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో శ్రీ విజయ హాస్పిటల్, శ్రీ సీతారామ మెమోరియల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా మున్సిపాలిటీ బాబు నాయక్ తండా ప్రాథమిక పాఠశాల నందు ఏర్పాటు చేశారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో బాబునాయక్ తండా, పత్తిపాక, మంగళ కాలనీ, సాంక్రియ తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రొయ్యూరు సురేష్, డాక్టర్ దారావత్ రెడ్డి నాయక్ కంటి వైద్య నిపుణులు, డాక్టర్ కవిత కంటి వైద్య నిపుణులు, శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ నందు జనరల్ ఐ చకప్, గ్లూకోమా, మెల్లకన్ను, కాంటాక్ట్ లెన్సెస్, హైమోఫియా కొరకు ఐసిఎల్, స్పెషాలిటీ సర్వీసెస్, కార్నియా, ట్రోపోగ్రఫీ కెరటోకోనస్, రెటీనా, లేజర్ కంటి ఆపరేషన్, రెటినాల్ వాస్కులర్ డిజార్డర్స్, ఊవీయా, ప్లాస్టిక్ సర్జరీ, అదేవిధంగా మానుకోట జిల్లా పట్టణ గ్రామీణ ప్రాంతాల వారి కోసం ప్రారంభించిన శ్రీ సత్య లయన్స్ కంటి హాస్పిటల్ లో అత్యాధునికమైనా పరికరాలతో కంటి పరీక్షలు, ఫెకో సర్జరీ, లాసిక్ సర్జరీ, కంటి ఆపరేషన్లు చేసి, కంటిలో శుక్లాలను పొరలను ఇంజక్షన్ ఇవ్వకుండా, పట్టి కట్టకుండా, కట్టు వేయకుండా, నొప్పి లేకుండా, సూపర్ లేజర్ ఆపరేషన్లు చేస్తారు. అదేవిధంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు, అధిక పోటుతో వచ్చే బీపీ ఉన్న వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకమైన చికిత్స అందుబాటులో కలదని, కంటిలో పెరిగే మాంసముకు కుట్టు లేకుండా గ్లూతో ఆపరేషన్ చేస్తారని తెలిపారు. గ్లోకోమాకు, ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స, దగ్గర చూపుకు, దూరం చూపుకు, మెడ నొప్పులకు, తలనొప్పికి సరసమైన ధరలకే అద్దాలు, ప్రోగ్రెసివ్, క్రిజల్, ఫినోలెన్స్ అతి తక్కువ ధరలకే ఇస్తారన్నారు. డాక్టర్ జాటోత్ వేణు ఫిజియోథెరపిస్ట్, శ్రీ సీతారామ్ మెమోరియల్ దవాఖాన, కన్సల్టెంట్ డాక్టర్ బి.జగదీశ్వర్ ఎంఐడి. పెడియట్రిక్స్ పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు, డాక్టర్ డి. విజయశ్రీ, ఎంబిబిఎస్, ఎండీ (గాంధీ ) జనరల్ మెడిసిన్, డాక్టర్ బి. రాము నాయక్ ఎంబిబిఎస్, ఎం.డీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డి నాయక్ మాట్లాడుతూ మన బాబునాయక్ తండాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఎక్కువ మంది ఉన్నందున, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని. కావున సీజనల్ కాకుండా వేరే వ్యాధులకు కూడా డాక్టర్లు ఉన్నందున, ఈ మెడికల్ క్యాంప్ నందు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు నందు పలు రకాల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు, పిల్లలకు న్యూట్రిషన్ కిడ్స్ పంపిణీ చేసి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న ఫిజియోథెరపి డాక్టర్ జాటోత్ వేణు నాయక్, బానోత్ రమేష్, బానోత్ భాస్కర్, సర్వన్, శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ మేనేజర్ ధారావత్ బాలునాయక్, పిఆర్ఓ మోహన్ నాయక్, శ్రీ విజయ హాస్పిటల్ సూపర్వైజర్ వసంత్ కుమార్, ప్రమీల, రాజశేఖర్, అంగోత్ అఖిల్ నాయక్, రూప్ సింగ్, సక్రం, భూక్యా నాచ, ఆంగోత్ శీను, బానోత్ సోములు, రాంచందర్, కృష్ణ, తండా యూత్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సాయి సంజీవని ఆసుపత్రి ప్రారంభం



**విశ్వంభర , చండూర్ :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి చండూర్ మున్సిపాలిటీ పరిధిలో సాయి సంజీవని ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి నాణ్యమైన వైద్యాన్ని అందించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఎంబిబిఎస్ చదువుకొని కార్పొరేట్ ఆసుపత్రులలో పని చెయ్యకుండా సొంత ఊరికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన మాస కృష్ణ కుమార్తె డాక్టర్ శివాణిని అలాగే కుటుంబ సభ్యులను అభినందించారు. డాక్టర్ శివాని మాట్లాడుతూ చిన్ననాటి నుండి తనకు డాక్టర్ కావాలనే కల ఉందని , ఆ కలను మా తల్లితండ్రుల ద్వారా సాకారం చేశారని అన్నారు. డాక్టర్ గా నా ప్రయాణం నా సొంతఊరిలో చేయడం చాల సంతోషంగా ఉందని అన్నారు.

## అక్రమ కేసులపై మహిళల ఆగ్రహం



**విశ్వంభర చింతపల్లి:** అక్రమంగా తమ కుటుంబ సభ్యులపై కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని వింజమూరు గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం మండల కేంద్రంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 12వ తేదీ రాత్రి ఓ వినాయక నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పలువురు దళితులను అదే గ్రామానికి చెందిన కొంతమంది కులం పేరుతో దూషించారు. మాదిగ కులానికి చెందిన మీరు మా బజారుకు ఎలా వస్తారని అవమానించడంతో ఆ కులానికి చెందిన యువకులు మమ్మల్ని కులం పేరుతో ఎలా దూషిస్తారని ప్రశ్నించారని మహిళలు తెలిపారు. దీంతో మమ్మల్ని మీరు ప్రశ్నిస్తారా? అని వారు కర్రలతో దళిత యువకులపై దాడి చేశారని వారు తెలిపారు.

ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుల ప్రోత్బలంతో దళిత యువకులపై, వారికి మద్దతు తెలిపిన వారిపై మొత్తం 17 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అక్రమంగా జైలుకు పంపారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా గ్రామంలో ఎలాంటి విచారణ చేపట్టకుండా జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వింజమూరు గ్రామానికి చెందిన నూనె సంతోష, పందుల తిరుపతమ్మ పై పలువురు వ్యక్తులు బీరు సీసాలతో, కర్రలతో దాడి చేసి చంపుతామని వెంబడించి నానా బూతులు తిట్టి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. దళితులను కులం పేరుతో అవమానించి, మహిళలపై దాడి చేసిన వ్యక్తులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ వారు అధికార పార్టీకి చెందిన వారి ఫిర్యాదులను మాత్రమే పరిగణలోకి తీసుకొని, కాంగ్రెస్ పార్టీ కాని వారి ఫిర్యాదులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇదేమని ప్రశ్నిస్తే సీఐ నవీన్ కుమార్, ఎస్సై యాదయ్యలు బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కాంగ్రెస్ ఏజెంట్లుగా పని చేస్తూ అమాయకులైన యువకులపై, ఇతర పార్టీ నాయకులపై రాజకీయపరమైన, ఉద్దేశపూర్వకమైన, కక్షలు పెంచుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని మహిళలు అన్నారు. వింజమూరు గ్రామానికి చెందిన ఓ మాజీ ఎంపీటీసీ కోరికతో ఎమ్మెల్యే గ్రామ యువకులను తీవ్ర హింసలకు గురి చేస్తున్నారని వారన్నారు. అకారణంగా కులం పేరుతో దూషించి, మహిళలపై దాడి చేసిన వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, ఎస్పీ కార్యాలయాన్నీ ముట్టడించి, మానవ హక్కుల కమిషన్ ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

## ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, భూపాలపల్లి:** నిత్యం ప్రజల కోసం ఆలోచన చేసే వారికి తనవంతు సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిన గొప్ప వ్యక్తి స్వర్గీయ బండం లక్ష్మారెడ్డి అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ స్వర్గీయ బండం లక్ష్మారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మహాదేవ్‌పూర్ మండలం బొమ్మాపూర్ గ్రామంలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లక్ష్మారెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బండం లక్ష్మారెడ్డి లాంటి నాయకుడు ఎక్కడా దొరుకడని అన్నారు. ఆనాడు మల్లారం గ్రామానికి చెందిన మల్హార్‌రావు ఈనాడు బొమ్మాపూర్‌కు చెందిన లక్ష్మారెడ్డినే చూస్తున్నానని, తన చిన్నతనంలో మల్హార్‌రావు చనిపోతే అనేక మంది తమ ఇండ్లలో మల్హార్‌రావు ఫోటో పెట్టుకున్నారని, అంత గొప్ప నాయకుడని ఆయన కొనియాడారు. ఈనాడు సైతం గ్రామస్తులు బంధం లక్ష్మారెడ్డిని హృదయాల్లో దాచుకున్నారని అన్నారు. తొమ్మిదేండ్లు ఆయనతో నడిచిన తాను అనేక విషయాలను నేర్చుకున్నానని అన్నారు. కల్మషం లేని మనస్సు కల్గిన నాయకుడు లక్ష్మారెడ్డి అని, అధికార పార్టీలో ఉంటూ ఏ సమస్య అయినా పరిష్కారం కాకపోతే ప్రజలు కోపగించుకున్నా ఏనాడు ఆవేశపడలేదన్నారు. లక్ష్మారెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం గ్రామస్తులంతా సమిష్టిగా ఎంతో కృషి చేశారని, ప్రజల సహకారంతోనే ఈనాడు విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. లక్ష్మారెడ్డి గురించి తెలుసుకోవడం, ఆయన ఆశయాలు, ఆయన స్ఫూర్తిని బావితరాలకు అందించాలనే ఆలోచనతోనే విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. లక్ష్మారెడ్డి కుటుంబానికి అండగా నిలిచి ఏ అవకాశం వచ్చినా వారిని గొప్పస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు.



శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాలయ చైర్మన్ రావిరాల నగేష్ దంపతులు , జూలూరు ఆంజనేయులు దంపతులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- విశ్వంభర, చండూర్

# మెట్రో స్టేషన్‌లో ఆరోగ్య కేంద్రాలు
# దేశంలోనే తొలిసారిగా ఎల్బీనగర్‌లో ప్రారంభం

- హాజరైన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఇబ్రహీంపట్నం ఎంమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**విశ్వంభర, వనస్థలిపురం :** దేశంలోనే మొట్టమొదటి సారిగా హైదరాబాద్ మెట్రో స్టేషన్స్ లలో ఆరోగ్య సేవలు అందుబాటులో రావడం గర్వకారణం అని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. మిట్టా ఎక్స్ లెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్ మెట్రో స్టేషన్లో పాలీ హెల్త్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. ముఖ్య అతిథిగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మెట్రో ప్రయాణికులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని అన్నారు. మొదటిసారిగా హెల్త్ ఏటీఎం కూడా అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రక్త పరీక్షల డయాగ్నస్టిక్ సౌకర్యం, మెడికల్ షాప్, వైద్య నిపుణులు, ఫిజియోథెరపీ, టెలి మెడిసిన్, డెంటల్ కేర్ ఇలా అన్ని మెట్రో స్టేషన్లలో ఆధునిక కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి రావడం దేశంలోనే రికార్డు అని గద్వాల్ విజయలక్ష్మి వివరించారు. ఇబ్రహీంపట్నం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. లక్షలాది మంది ప్రయాణించే మెట్రో ట్రైన్స్ లో ఎలాంటి అనారోగ్యానికి గురైనా వెంటనే ఎమర్జెన్సీ క్లినిక్స్ స్టేషన్లలో అందుబాటులో ఉండటం గొప్ప విషయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు చూపు ఆదర్శనీయం అన్నారు. మిట్టా ఎక్స్ లెన్స్ చైర్మన్ డా. మిట్టా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీనగర్‌లో తొలి క్లినిక్ ప్రారంభించామని, త్వరలో మియాపూర్, రాయదుర్గం మెట్రో స్టేషన్స్ లో అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా వంద మెట్రో కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన ఎనీమియా ముక్త భారత్ పిలుపులో భాగంగా తాము ఉచితంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఏఐ చెక్, ఆడియోమెట్రీ లాంటి 21 టెస్టులు ఉచితంగా చేయనున్నట్లు మిట్టా శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో మిట్టా ఎక్స్ లెన్స్ డైరెక్టర్లు డాక్టర్ నిఖిల్, సీనియర్ జర్నలిస్ట్ డా. మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

### విఘ్ననాథుడికి
## తల్లోజు ఆచారి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, కల్వకుర్తి :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గాంధీ నగర్, విద్యా నగర్, లోని పలు గణేష్ మండపాలను మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి సందర్శించి, గణనాథులకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆచారి ని ఘనంగా సత్కరించారు. లంబోదరుని ఆశీస్సులతో విఘ్నాలన్ని తొలగిపోయి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీజేపీ పార్టీ సీనియర్ లీడర్ రాంభూపాల్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, రాఘవేందర్, చందు ముదిరాజ్, కృష్ణ గౌడ్, అభిలాష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీధర్, బాబీ, రవి రాథోడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలను దర్శించుకున్న ఎమ్మెల్యే



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజకవర్గం వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భారతి నగర్, రామచంద్రపురం, అమీన్పూర్ మున్సిపాలిటీ, పటాన్చెరు మండలం ఇంద్రేశం గ్రామాల పరిధిలో ఏర్పాటుచేసిన వివిధ వినాయక మండపాలను ఆదివారం పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలనుప్రారంభించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణనాథునికి ఎంపీ రఘునందన్ పూజలు



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజకవర్గం వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పటాన్ చెరువు టౌన్ లోని గోనెమ్మ బస్తిలో గల గోనెమ్మ యూత్ అసోసియేషన్ వినాయకుని దర్శించుకుని గణనాథుని పూజలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. గోనెమ్మ యూత్ సభ్యులందరూ రఘునందన్ రావునీ శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ శాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోనెమ్మ బస్తీ వాసులు, అసోసియేషన్ సభ్యులు కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణవేత్త కిషన్ రావు సంస్మరణ సభ




**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన పర్యావరణవేత్త కాలుష్య నివారణ ఉద్యమ యోధుడు స్వర్గీయ డా ఎ. కిషన్ రావు సంస్మరణ సభ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డా. ఎ. కిషన్ రావు పర్యావరణ సంరక్షణ కొరకు, కాలుష్య నివారణ కొరకు అహర్నిశలూ శ్రమించిన పర్యావరణ ఉద్యమ యోధుడని అన్నారు. అటువంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అలాగే మనందరం కూడా ఆయన బాటలో పయనిస్తూ, పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు భావితరాల కొరకు సంరక్షించు కోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మాజీ జిన్నారం జడ్పిటిసి ప్రభాకర్, నరేందర్ రెడ్డి, కొల్కూరి రాజశేఖర్ రెడ్డి, నాగసాని నరేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్స-వాలలో భాగంగా గణేశుడి వద్ద కుంకుమార్చన , ప్రత్యేక పూజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వహించారు.

- విశ్వంభర, సికింద్రాబాద్



## 26 ఏళ్ల వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆధునిక వైద్యంలో మరో అడుగు ముందుకేసిన, టీఎక్స్ హాస్పిటల్ వైద్యులు 26 ఏళ్ల వ్యక్తికి అరుదైన, సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ రోగి రోజుకు 510 సార్లు నిరంతర ఫోకల్ మూర్ఛలు (మూర్ఛ)తో బాధపడుతున్నాడు. రోగి ప్రసంగ ప్రాంతానికి సమీపంలో మెదడు కణితి ఉన్నట్లు నిర్ధారించబడింది. ఇది శస్త్రచికిత్స సమయంలో దెబ్బతిన్నట్లయితే శాశ్వత ప్రసంగ బలహీనతకు కారణమవుతుంది. న్యూరోసర్జన్ డాక్టర్ నరేష్ కుమార్ గజ్జల నేతృత్వంలోని వైద్య బృందం జాగ్రత్తగా 'అవేక్ క్రానియోటమీ' అనే ప్రత్యేక శస్త్రచికిత్సను ఎంచుకున్నారు. డాక్టర్ కీర్తికర్ రెడ్డి, డాక్టర్ దీపక్ రాజు, రవీంద్రారెడ్డి నిర్వహణ బృందం సహాయంతో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. న్యూరోసర్జన్ డాక్టర్ నరేష్ కుమార్ గజ్జల, టీఎక్స్ గ్రూప్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ వొడ్నాల మాట్లాడుతూ.. కణితిని పూర్తిగా తొలగించామని, పేషెంట్ ప్రసంగం, మోటారు విధులు ప్రభావితం కాలేదని తెలిపారు. శస్త్రచికిత్స తర్వాత రోగికి మూడు వారాలకు పూర్తిగా కోలుకున్నాడని అన్నారు. "ఈ అవేక్ క్రానియోటమీ టీఎక్స్ హాస్పిటల్స్ యొక్క అధునాతన వైద్య సామర్థ్యాలను ప్రదర్శిస్తుందని, తమ బృందం రోగి భద్రతకు కట్టుబడి, హైరిస్క్ న్యూరోలాజికల్ కేసులను నిర్వహించడంలో మెరుగైన ఫలితాల సాదిస్తుందన్నారు. ఇది తమ ఆసుపత్రికి కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని శ్రీకాంత్ వొడ్నాల అన్నారు.

## మాజీ సర్పంచ్ ఆర్థిక సాయం



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం గంగారాం గ్రామ పంచాయతీ గంగారాం తండలో మునవత్ మాధ్య కుమారుడు గణ్య శనివారం మరణించారు. వారి కుటుంబాన్ని గ్రామ మాజీ సర్పంచ్ సాలి వీర నాయక్ పరామర్శించారు. అనంతరం 15,000 రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. పదవి లేకపోయిన గ్రామప్రజలపై ఎంతో సానుభూతిని చూపుతున్న సాలీ వీర నాయక్ ను పలువురు కొనియాడారు.

## శివసేన గణేశుడికి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీనివాస కాలనీ బీసీ హాస్టల్ దగ్గర శివసేన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ గణనాథుని ఏర్పాటు చేశారు. వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేసిన గాజుల తిరుపతయ్య దంపతులకు కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ సన్మానం చేశారు. మూడు లక్షల రూపాయలతో 21 అడుగుల బాలాపూర్ వినాయక విగ్రహానికంటే రెండు అడుగులు పెద్ద విగ్రహాన్ని తయారు చేయించి పూజలు నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించారు. వినాయకుడి ఆశీస్సులతో ఆమనగల్ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని లక్ష్మణ్ కోరారు. భారీ గణనాధుని చుట్టుపక్కల ప్రజలు తండోపతండాలుగా వచ్చి వీక్షిస్తున్నారు. పూజా కార్యక్రమంలో సాయిబాబా దినేష్, బాలకృష్ణ, వెంకటేష్, చెక్కల శోభ, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వరల్డ్ స్కేట్ గేమ్స్ కు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు



**విశ్వంభర, హైదరాబాద్:** 2024 సెప్టెంబర్ 18 నుండి 24 వరకు ఇటలీలో జరిగే వరల్డ్ స్కేట్ గేమ్స్ 2024లో పాల్గొనేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎల్‌బి స్టేడియం స్కేటర్‌లు ధృవీ లఖోటియా స్కేట్‌బోర్డ్ ఈవెంట్‌లో మరియు రోలర్ ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో మోక్షిత్ రామ్ రెడ్డి లులకు చోటు దక్కింది. ప్రతిష్టాత్మకమైన ఈ గేమ్స్ లో వీరికి చోటు దక్కడం పట్ల వారి కోచ్ జితేందర్ గుప్తా సంతోషం వ్యక్తం చేశారు.

## తుక్కుగూడ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర సెమినార్




**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ పట్టణ కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర సెమినార్ మన ఆర్థిక విధానం ప్రజల కోసమా, లాభాల కోసమా అనే అంశంపై రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు సెప్టెంబర్ 23, 24 తేదీలలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఫ్యాబ్ సిటీ ముందు, తుక్కుగూడలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి దత్తు నాయక్ మాట్లాడుతూ సెప్టెంబర్ 23న తుక్కుగూడ ఎస్ ఎన్ గ్రాండ్ లో రాష్ట్ర సెమినార్ జరుగుతుందన్నారు. ఈ సెమినార్ కు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ నాగేశ్వర్ మాజీ ఎమ్మెల్సీ హాజరవుతున్నారు. కార్మికుల జీవన స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితులు పరిణామ క్రమంలో మారుతున్న పరిస్థితులలు, కార్మిక చట్టాలు, లేబర్ కోడ్స్, కార్మికుల ఉద్యోగ భద్రత, మహిళా కార్మికుల కు రక్షణ, ఎనిమిది గంటల పని విధానం కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ బోనస్ గ్రాడివిటీ, భవన నిర్మాణ కార్మికుల జీవన విధానం వంటి అనేక అంశాలపై చర్చించనున్నారు. తుక్కుగూడ పట్టణంలో రాష్ట్ర సెమినార్ లో కార్మికులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి రాజు, వైట్ క్లిప్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, సురం గుట్ట ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్, యూనియన్ నాయకులు భారతి, కల్పన, కృష్ణవేణి, అనురాధ రాణి పాండు భాను, రాములు, సాయి, బాలు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు



**విశ్వంభర, దేవరకద్ర :** దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్వగ్రామం దమగ్నాపూర్ లో ఆదివారం ఆయన తండ్రి కృష్ణా రెడ్డి దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ సెక్రటరీ వంశీచందర్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలు అనిరుద్ రెడ్డి, రాజేష్ రెడ్డి, వంశీకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, పర్ణిక రెడ్డి, సరితా, వీర్లపల్లి శంకర్ మాజీ మంత్రి చిన్నారెడ్డి ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారిన పాలన తీరు మారదా?



**విశ్వంభర, మహబూబాబాద్ :** కరకగూడెం బూటకపు ఎన్కౌంటర్ విషయమై నిజ నిర్ధారణకు వెళ్తున్న పౌర హక్కుల సంఘం(CLC) రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్,రాష్ట్ర కార్యదర్శి నారా యణ రావు,సహాయ కార్యదర్శి కుమారస్వామి తదితర 11 మంది హక్కుల సంఘం నాయకుల్ని మణుగూరు సమీపంలో పోలీసులు నిర్బంధించడాన్ని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య తీవ్రంగా ఖండించారు. ప్రజాపాలన అంటూ పౌరహక్కుల రక్షణను ఏడవ గ్యారెంటీగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆహామీలను తుంగలో తొక్కుతున్న దన్నారు.బయ్యారం గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ నిజనిర్ధారణకు వెళ్లుతున్న వారిని ఆపడం అంటే వాస్తవాలు బయటకు రాకుండా తొక్కిపెట్టడమే అవుతుందన్నారు. నిజమైన ఎన్కౌంటర్ అయితే నిజ నిర్ధారణ బృందాన్ని జరిగిన ప్రాంతానికి అనుమతించాలని, కరకగూడెం ఎన్కౌంటర్ పోలీసులు పక్కా పథకం ప్రకారం కాల్చి చంపడం వల్లనే నిజనిర్ధారణ బృందాన్ని, పత్రికల వారిని అనుమతించ కుండా, బయట ప్రపంచానికి వాస్తవాలు తెలియకుండా చేయుటకు నిజ నిర్ధారణ బంధాన్ని అశ్వాపురం పోలీ సు స్టేషన్లో నిర్బంధించారని అన్నారు. నిజనిర్ధారణ బృందాన్ని విడుదల చేసి ఎన్కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని సందర్శించి, వాస్తవాలను తెలుసుకొనుటకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారినా పాలన తీరు మారటం లేదనటానికి బూటకపు ఎన్ కౌంటర్లు,అక్రమ నిర్బంధాలే నిదర్శనమన్నారు. ప్రభుత్వం మారినా పాలన తీరు మారటం లేదనటానికి బూటకపు ఎన్ కౌంటర్లు,అక్రమ నిర్బంధాలే నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రజాస్వామిక పాలన అనే ఏడవ గ్యారంటీ ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈసమావేశంలో బయ్యారం మాజీ సొసైటీ చైర్మన్ రామగిరి బిక్షం,పార్టీ గ్రామ నాయకులు కొదుమూరి నాగేశ్వరరావు, బీరెడ్డి సంగయ్య,కోనూరి యుగందర్,ఎనుగుల మురళీ, నిడికొండ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 26న తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు



**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 26న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించే రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్, తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ మేకల సారయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు పోరాడిన ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి కొండ సురేఖ, పార్లమెంటు సభ్యులు మల్లు రవి, వద్దిరాజు రవిచంద్ర, తెలంగాణ ఉద్యమ సారథి ఎమ్మెల్సీ కోదండరామ్, సినీ నటులు మాజీమంత్రి బాబు మోహన్, ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ ఎన్ బాబురావు, కూచిపూడి బాబురావు ఐపీఎస్ మాజీ అడిషనల్ డీజీపీ, ఉమ్మడి జిల్లాల చైర్మన్లు కన్వీనర్లు విచ్చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ కే ప్రసాద్, అధికార ప్రతినిధి స్టీఫెన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా చైర్మన్ లుదియా, కన్వీనర్ పద్మ, ఉమ్మడి ఖమ్మం జిల్లా జేఏసీ మహిళలు ఏసు రత్నం, పాల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కుర్రి ఏలియా, చెరుకూరి రత్నరాజు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి

- శ్రీధర్ బాబు




విశ్వంభర, హైదరాబాద్: కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు ఘాటుగా స్పందించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రతిపక్షనాయకులు ప్రయత్నిస్తున్నారని మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. పరిపాలన కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమని మంత్రులు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని రావుల చెరువుకట్ట గజానన సంస్థ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలు పరిశీలిస్తే ఎవరు తెలివితేటలు చూపిస్తున్నారో కనిపిస్తోందని శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన శాసనసభ్యుడైన గాంధీ తాను కారు పార్టీ ఎమ్మెల్యేనని వ్యాఖ్యానించారన్నారు. బీఆర్ఎస్ అంతర్గత విషయాల్లో తాము కలుగజేసుకోమని, వాటిని ఆ పార్టీయే పరిష్కరించుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై నెపం వేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని శ్రీధర్ బాబు తెలిపారు.ఎవరు తెలివిగలవారో ప్రజలే చెబుతారనీ, రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడి ప్రజలందరూ తెలంగాణ వాసులేనని, వారందరినీ గౌరవిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచేందుకు అందరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరు ఏం చేసినా నగర ఇమేజ్‌ను కాపాడుతామని స్పష్టం చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు..

10 ఏళ్లు అధికారంలో ఉన్నవాళ్లు (బీఆర్ఎస్) 10 నెలల్లోనే అసహనానికి గురై శాంతిభద్రతలకు భంగం కలిగిందని ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లేవిధంగా మాట్లాడితే పొరపాటు అవుతుందని మంత్రి పొన్నం అన్నారు. బీఆర్ఎస్ మాటలు చూస్తుంటే రాష్ట్రం అల్లకల్లోలం కావాలని చూస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. పార్టీ ఫిరాయింపుల అంశం న్యాయస్థానంలో ఉందని, వినాయక నిమజ్జనం అయ్యేంత వరకు రాజకీయ విమర్శలు మానుకోవాలని కోరారు.

## గణపతి ఉత్సవాల్లో బీజేపీ నాయకులు



విశ్వంభర, వికారాబాద్ : మర్పల్లి మండలం ఘనపూర్, పట్లూర్, పట్లూర్ తండా, పంచలింగాల్ లో కొలువుదీరిన గణనాథులను బీజేపీ నాయకులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శారద హాస్పిటల్ డైరెక్టర్ కొప్పుల రాజశేఖర్, నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ వడ్ల నందు, వికారాబాద్ పట్టణ పార్టీ అధ్యక్షులు నరోత్తం రెడ్డి, మర్పల్లి మండల పార్టీ అధ్యక్షులు రమేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచులు యాదవ రెడ్డి, యాదగిరి, శ్రీను, ఆనంద్ ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్



విశ్వంభర, వికారాబాద్ : మున్సిపల్ లోని వివిధ వినాయక మండపాలను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆధ్వర్యంలో వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ గణేశుడికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసారు. ఈ సందర్భంగా వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఆహ్వానం

విశ్వంభర, ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో నవరాత్రులు పూర్తి చేసుకొని సోమవారం నిమజ్జనం కానున్న గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గణనాధుని నిమజ్జన శోభయాత్ర ఉత్సవ కమిటీ ప్రారంభించారు. నిమజ్జనోత్సవానికి ఉత్సవ పోషకులు, భక్తులు, గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు అందరూ సకాలానికి హాజరు అయి గణనాధుని సేవకు పాత్రులు కావాలని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం కమిటీ అధ్యక్షుడు గుండెగోని అయిలయ్య గౌడ్ కోరారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాగణపతి హోమం



విశ్వంభర, రామన్నపేట: రామన్నపేట మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహాగణపతి హోమం మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పు ఈశ్వరయ్య, మండల ఆర్యవైశ్య సంఘం భవన కమిటీ గౌరవ అధ్యక్షులు విజయానందం, వాసవి భవన్ అధ్యక్షులు కొంపెల్లి సురేష్, పట్టణ కమిటీ అధ్యక్షులు తమ్మిశెట్టి సందీప్ కుమార్, లక్ష్మాపురం తాజా మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, ఉప్పు వెంకన్న, కొత్త మాస మధుసూదన్, నవీన్ కుమార్, శ్రీనివాస్, గంధ రవీందర్, రోహిపల్లి సుభాష్, కొత్త మాసు కైలాసం, కృష్ణమూర్తి, సుధాకర్, కొంపెల్లి వెంకటేష్, కొంపెల్లి సత్తయ్య , రాంప్రసాద్, కొంపెల్లి సుమలత, తమ్మిశెట్టి జ్యోతి, విజయ , నిర్మల , గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మేలుకొలుపు యాత్రను విజయవంతం చేయండి

విశ్వంభర,హైదరాబాద్ : సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే మాదిగల మేలుకొలుపు యాత్ర విజయవంతం చేయాలని మాజీ మంత్రివర్యులు ఏ చంద్రశేఖర్ అన్నారు. మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్ర కరపత్రాన్ని ఏ చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎవరి జనాభా ఎంత ఉంటే వారికి అంత రిజర్వేషన్ కల్పించాలని మాజీ మంత్రి ఏ చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద కులమైన మాదిగలకు న్యాయం జరిగే విధంగా వర్గీకరణ ఫలాలు అందాలని దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై కమిటీ వేయడం హర్షనీయమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాదిగల అధిక సంఖ్యలో ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్ ,పెద్దపల్లి జిల్లాలకు మాదిగల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే మాదిగల మేలుకొలుపు యాత్ర రాష్ట్రంలో ఉన్న మాదిగలు విజయవంతం చేయాలని ఈ మేలుకొలుపు యాత్ర కొత్తగా ఏర్పడిన 33 జిల్లాల కేంద్రంగా సాగుతుందని మేలుకొలుపు యాత్రకు మాదిగలంతా సంఘీభావం తెలపాలని మాదిగ సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు భూమా బాబూరావు, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఒక్కల గడ్డ చంద్రశేఖర్, పెద్దపల్లి జిల్లా నాయకులు వర్ణప్రసాద్, తెలంగాణ దళిత దండు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రమల్ల మొగులయ్య, జేఏసీ రాష్ట్ర యువజన అధ్యక్షులు నక్క మహేష్, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జెరిపోతుల సాయి మాదిగ, మాదిగ JAC నాయకుడు దేవరకొండ నరేష్, రమేష్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## యోగాతో ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చు

జగదీశ్వర్ యాదవ్




విశ్వంభర, సరూర్ నగర్: యోగతో ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కే జగదీశ్వర్ యాదవ్ అన్నారు. ఆదివారం సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో 11 వ ఇంటర్ డిస్టిక్ యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్షిప్2024, తెలంగాణ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే యోగ పై మెలకువలు, అవగాహన నేర్పించాలన్నారు. ఒత్తిడి ప్రపంచంలో ప్రతి ఒక్కరికి యోగా ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సారంగపాణి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ అధికారి వెంకటేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ట్రెజరర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం

సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముస్తఫా




విశ్వంభర, మూసాపేట్: రక్తదానం మహాదానమని షైన్ వేవ్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముస్తఫా, విజయ లు అన్నారు. మూస పేట్ ఎస్ పి నగర్ కాలనీలో షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ వారు గణేష్ నిమజ్జనం సందర్భంగా రామసేన భక్త మండల్ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, షేన్ వేవ్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామసేన యూత్ అసోసియేషన్ సభ్యులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు తీవ్ర అస్వస్థత



విశ్వంభర, డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచందర్ నాయక్ కు ఊహించని పరిణామం చోటు చేసుకుంది. రామచందర్ నాయక్ కు వైరల్ ఫీవర్ తో తీవ్ర అస్వస్థత నెలకొంది. స్వతహాగా వైద్యుడు అయినా డాక్టర్ రామచందర్ నాయక్ తగిన జాగ్రత్తలు తీసుకున్నా వైరల్ ఫీవర్ భారినుండి తప్పించుకోలేకపోయారు. డోర్నకల్ నియోజకవర్గం లో భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలను , ముంపు ప్రాంత ప్రజలను వరుసగా వారం రోజులు వర్షం లో తడుస్తూ అధికారులతో కలిసి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ నియోజకవర్గం లో గడిపారు డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచందర్ నాయక్. ఈ తరుణంలోనే గత మూడు రోజులుగా తీవ్ర అస్వస్థత కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామచందర్ నాయక్ పరిస్థితి కొంచెం ఆందోళనకరంగా ఉందని మెరుగైన చికిత్స తో పాటు పూర్తిగా కొంత టైం రెస్ట్ తీసుకోవాలని వైద్యుల సలహా ఇచ్చినట్టు సమాచారం.

## కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు సమన్యాయం

నీలం మధు ముదిరాజ్



విశ్వంభర, హైదరాబాద్: నూతన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని మెదక్ పార్లమెంటు కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. నూతన టీపీసీసీ రథసారథిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా అసెంబ్లీ గన్ పార్క్ నుండి గాంధీభవన్ వరకు జరిగిన ర్యాలీలో గన్ పార్క్ వద్ద ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి ర్యాలీ లో నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ బీసీ బిడ్డకు పెద్ద పీట వేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నాయకత్వ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి రుణపడి ఉంటామన్నారు. అన్నివర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తూ ఓట్లతో పాటు రాజకీయ అధికారం సైతం అప్పగిస్తూ అన్ని వర్గాలను ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఒకవైపు బీసీలకు రాజకీయ అవకాశాలు మరింతగా పెంపొందించేందుకు బీసీ కుల గణన ను త్వరలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. బీసీ బిడ్డకు పీసీసీ రథసారధిగా అవకాశం కల్పించేలా ప్రోత్సహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ మంత్రులకు ముఖ్య నాయకులకు బీసీ కులాల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ శివసేన రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవం వేడుకలకు ఏర్పాట్లు

విశ్వంభర, వికారాబాద్ : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. టేలి కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులకు సూచించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించేదుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇండిపెండెన్స్ డే ఏర్పాట్లు ఎలా చేశామో అదే తరహా లో జిల్లాలో ప్రజాపాలన వేడుకలు నిర్వహణకు వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని అన్నారు. ముఖ్య అతిథుల ఆగమనం, పోలీస్ గౌరవ వందనం స్వీకరించడం, తెలంగాణ జాతీయ సాంగ్ ప్లే చేయడం, జిల్లా అభివృద్ధి పై స్పీచ్ ఏర్పాటు, త్రాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. మండల, గ్రామ పంచాయతీ పరిది లో ఉండే అధికారులు ప్రజా పాలన దినోత్సవం ఏర్పాట్లు చేయాలనీ, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ టేలి కాన్ఫరెన్స్ లో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్ డి ఓ వాసు చంద్ర, మండల స్పెషల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం అందించాలి

అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య



విశ్వంభర, మేడిపల్లి: అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించే కార్యక్రమం 291 ఆదివారాలుగా బోడుప్పల్లో విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలు పూర్తిగా కార్పొరేట్ సంస్థల చేతిలో చిక్కడంతో నిరుపేదలకు మెరుగైన విద్యా వైద్యం అందని ద్రాక్ష గానే మిగులుతున్నాయని, తమ పిల్లల చదువుల కోసం,ఆరోగ్యం కోసం తాను సంపాదించిన ఆస్తులు సైతం అమ్ముకునే పరిస్థితి ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరిచి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి విద్యా వైద్య రంగాలను బలోపేతం చేసి సామాన్యులకు కార్పొరేట్ సాయి విద్యా వైద్యాన్ని ఉచితంగా అందించినప్పుడే సమాజంలోని అన్ని వర్గాలు, అన్ని కులాలు అభివృద్ధి చెందుతాయని నత్తి మైసయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య,రాపోలు శ్రీరాములు గరుగుల యాకయ్య, బండారి సాయి, మూర్తి,బెక్కం శివ,సవరపు బయన్న, శంకర, నాగేష్,నరసింహ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



విశ్వంభర, మహేశ్వరం: బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్పేట్ , అల్మాస్ గూడ, గుర్రంగూడ లో శ్రీ వినాయకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మహేశ్వరం నియోజకవర్గము ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి యువ నాయకులు కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సబితా ఇంద్రారెడ్డికి బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు కాలనీ గణేష్ మండప కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. గణేష్ మండప వేద పండితులు సబితా ఇంద్రారెడ్డికి తీర్థ ప్రసాదములు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు కాలనీవాసులు సబితా ఇంద్రారెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గణనాధుడు ఆటంకాలు లేని ఆనందమయ జీవితాన్ని ప్రజలకు అనుగ్రహించాలని, తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథులు గంగమ్మ ఒడిలోకి చేరుకుంటున్న సందర్భంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా అంగరంగ వైభవంగా జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ సోదరుడు లడ్డు కైవసం



విశ్వంభర, పరిగి: పరిగి మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణనాథుడు తొమ్మిది రోజులు పూజలు అందుకున్నాడు. ఆదివారం గణనాథుని నిమజ్జనం సందర్భంగా తొమ్మిది రోజులు పూజలు అందుకున్న లడ్డు ను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వేలంపాట నిర్వహించగా నసీర్ అనే మైనార్టీ సోదరుడు 75,000 రూపాయలకు వేలంపాటలో లడ్డూని దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అరవింద్ రావు మాట్లాడుతూ ముస్లిం సోదరుడు లడ్డు దక్కించుకోవడం సంతోషకరమన్నారు. ఐక్యమత్యానికి, లౌకిక వాదానికి ప్రాతికగా నిలుస్తుందన్నారు. ముస్లిం సోదరుడు లడ్డు దక్కించుకోవడంతో సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని యాకుత్పురా నియోజకవర్గం గౌలిపుర డివిజన్ అంబికా నగర్ కన్యాకుబ్జ ఫంక్షన్ లైన్ లో గత నాలుగు సంవత్సరాలుగా ఈవెంట్స్ డెకరేషన్స్ ప్రోగ్రాములు చేస్తూ తన మిత్రుడైన మోహన్ సింగ్ తో కలిసి అజయ్ కుమార్ తనదైన శైలితో ఈసారి వినూత్న రీతిలో వినాయకుడిని నెలకొల్పారు. తదుపరి నాలుగు సంవత్సరాలకు కూడా తనదైన శైలితో నెలకొల్పుతానని ఈ సంవత్సరం 11 రోజులుగా నెలకొల్పుతున్నాను, వచ్చే సంవత్సరం నుండి మూడు రోజులు మాత్రమే ఈ యొక్క ప్రత్యేకతని చూపుతానని ఆయన మీడియా మిత్రులకు తెలిపారు.

- విశ్వంభర యాకుత్పుర



తెలంగాణ నూతన పీసీసీ చీఫ్ గా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గాంధీ భవన్ లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మరియు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లను గజమాలతో సత్కరించిన తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ .

- విశ్వంభర, హైదరాబాద్



# మంత్రాల నెపంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి హత్య!

**సుక్మా:** ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో ఆదివారం దారుణ ఘటన చోటు చేసుకున్నది. చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని గ్రామస్తులు కర్రలతో కొట్టి చంపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ ఘటన మురళీగూడ సమీపంలోని ఇట్కల్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఓ కుటుంబం చేతబడి చేస్తున్నట్లుగా అనుమానించిన గ్రామస్తులు.. ఒక్కసారిగా ఆగ్రహించి దారుణానికి పాల్పడ్డారు. హత్య కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఓ కుటుంబ చేతబడి చేయడంతో తమ కుటుంబ సభ్యుడు ఒకరు అనారోగ్యానికి గురయ్యారని ఓ కుటుంబం గ్రామస్తులతో కలిసి కుటుంబంపై దారుణం దాడి చేసింది. కర్రలతో దాడికి పాల్పడడంతో ఐదుగురు మృతి చెందారు. ఘటనను జిల్లా ఎస్పీ చౌహాన్ కిరణ్ గంగారాం ధ్రువీకరించారు. గ్రామస్తులు చేతబడి చేస్తున్నారనే అనుమానం ఉందని.. వారిని హత్య చేసేందుకు గ్రామస్తులు సైతం ఏకమయ్యారని తెలిపారు. అయితే, బాధిత కుటుంబం కొంతకాలంగా గ్రామస్తుల నుంచి అవమానాలతో పాటు ఇబ్బందులు సైతం ఎదుర్కొంటున్నట్లుగా ప్రాథమికంగా తెలిసిందన్నారు. గ్రామంలో పలువురు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడం.. ఈ అనర్థాలకు బాధిత కుటుంబమే కారణంగా పేర్కొంటూ టార్గెట్ చేసినట్లు తెలుస్తున్నది. హత్యకు కారణమైన పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులను మౌసం కన్న, మౌసం బుచ్చా, మౌసం బిరీ, కర్క లచ్చి, మౌసం అర్జోగా గురించారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ సైతం సందర్శించారు. నిందితులతో పాటు స్థానికులను పోలీసులు విచారిస్తున్నారు. ఫోరెన్సిక్ బృందంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో పరిస్థితిని అదుపు చేసేందుకు భారీగా బలగాలను మోహరించారు.

## వేర్పాటువాదులు, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ రాహుల్ గాంధీని సమర్థిస్తారు

**కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ**




**భాగల్పూర్:** కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల అమెరికా పర్యటనలో చేసిన ప్రకటనపై కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ స్పందించారు. రాహుల్ గాంధీ భారతీయుడు కాదని, ఆయన తన జీవితకాలంలో అధిక సమయం విదేశాల్లోనే గడుపుతారని అన్నారు. విదేశీ పర్యటనల్లో భారత్ గురించి తప్పుగా మాట్లాడతారని, ఆయనకు దేశం పట్ల ప్రేమ లేదని దుయ్యబట్టారు. రవ్‌నీత్ బిట్టూ ఆదివారం బిహార్‌లోని భాగల్పూర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.వేర్పాటువాదులు, బాంబులు, తుపాకీలు తయారుచేసేవారు, మోస్ట్ వాంటెడ్ పీపుల్ వంటి మారు మాత్రమే రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ప్రశంసిస్తారని ఎద్దేవా చేశారు. విమానాలు, రైళ్లు, రహదారులను తగులబెట్టే దేశ శత్రువులే రాహుల్‌ను సమర్థిస్తారని వ్యాఖ్యానించారు. దేశానికి అతిపెద్ద శత్రువు, నెంబర్ వన్ టెర్రరిస్ట్‌ను ఎవరినైనా పట్టుకోవాలంటే అది రాహుల్ గాంధీ మాత్రమేనని మండిపడ్డారు.కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు భారత్ గురించి చెడుగా మాట్లాడటం అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ అంతకుముందు ఆరోపించారు. ఈసీ వంటి భారత రాజ్యాంగ వ్యవస్థలను కూడా ఆయన తూలనాడుతుంటారని అన్నారు. బీజేపీ రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజల్లో రాహుల్ గాంధీ గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. అసలు రిజర్వేషన్లను తొలగించాలనే ఆలోచన రాహుల్ గాంధీ మెదడులో ఉందనే విషయం ఇప్పుడు వెల్లడైందని మంత్రి పేర్కొన్నారు.

## అరవింద్ కేజ్రీవాల్ అగ్నిపరీక్ష

**ఢిల్లీ సీఎం రాజీనామాపై రాఘవ్ చద్దా**

**ఢిల్లీ:** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆరు నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ ఆదివారం పార్టీ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించారు. తాను నిజాయితీపరుడినని ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ సీఎం పగ్గాలు చేపట్టబోనని చెప్పారు.కాగా కేజ్రీవాల్ సంచలన ప్రకటనపై పార్టీ సీనియర్ నేత రాఘవ్ చద్దా స్పందించారు. కేజ్రీవాల్ తన పదవిని త్యజించి అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు. ఆప్‌నకు ఓటు వేయడం ద్వారా కేజ్రీవాల్ నిజాయితీపరుడని ఢిల్లీ ప్రజలు నిర్ధారించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ దీవార్ మూవీలోని సన్నివేశాన్ని తలపిస్తూ ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ అమాయకుడని తమ చేతిపై రాసుకోవాలని చద్దా కోరారు. ఢిల్లీ ప్రజలు తమ తీర్పును వెలువరించేవరకూ తాను సీఎం స్థానంలో కూర్చోబోనని వెల్లడిస్తూ రెండు రోజుల్లో ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించడం ఆప్ వర్గాల్లో కలకలం రేపింది. ప్రజా తీర్పు అనంతరమే తాను సీఎం పదవి చేపడతానని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. కేజ్రీవాల్ అమాయాకుడా..? దోషా..? అని తాను ఢిల్లీ ప్రజలను అడగదలుచుకున్నానని చెప్పారు. ఢిల్లీ నూతన సీఎంను ఎన్నుకునేందుకు ఆప్ ఎమ్మెల్యేలతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను మహారాష్ట్రతో పాటు ఈ ఏడాది నవంబర్‌లో నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.




# పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ విద్యను తప్పనిసరి చేయాలి

**ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ పాయెంగ్**



**తముల్పూర్:** పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ విద్యను తప్పని సరి చేసి బోధించాలని ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ పాయెంగ్ అన్నారు. అసోం రాష్ట్రం తముల్ పూర్ లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో జాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోలెన్ దోయినరీ పౌరులతో కలిసి వందలాది మొక్కలు నాటారు. ప్రకృతిని కాపాడడం, పర్యావరణ విద్యను తప్పనిసరిగా పాఠ్యాంశాల్లో చేర్చాలని.. ప్రకృతి విధ్వంసంతో ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ మార్పులు, తద్వారా మానవాళికి పొంచి ఉన్న ముప్పు ఇంకా చాలామందికి అర్థం కావట్లేదని, ఆ దిశగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు మేల్కొనాల్సిన అవసరం ఉందన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ చాలా బాగా పనిచేస్తుందని విస్తృతంగా మొక్కలు పెంపకం తద్వారా పర్యావరణ రక్షణకు అవసరమైన విషయాలను జాగృతం చేసే దిశగా జోగినపల్లి సంతోష్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని జాదవ్ కొనియాడారు. ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని, స్థానిక సంస్థలు, ఎన్జీవోల సహకారంతో 2030 కల్లా అసోంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ అన్నారు. గత ఏడాది మొదలైన కార్యక్రమంలో ఇప్పటి వరకు 2.5 లక్షల మొక్కలు వివిధ ప్రాంతాల్లో నాటామని తెలిపారు. మజులీ ప్రాంతంలో జాదవ్ మొక్కలు నాటి అభివృద్ధి చేసిన మలైకోతాని తరహాలో మియావాకి విధానంలో చిక్కటి అడవుల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తామని సంతోష్ తెలిపారు. పర్యావరణ మార్పులతో ఈశాన్య హిమాలయాలకు ముంపు పొంచి ఉందని, హిమానీ నదులు కరగటంతో రానున్న రోజుల్లో సముద్ర మట్టం పెరిగి తీర ప్రాంతాల ముంపు ప్రమాదం పొంచి ఉందని జాదవ్ అన్నారు. ఒకప్పుడు పర్యావరణం పరంగా మంచి సమతుల్యత ఉన్న అసోంలో క్రమంగా అటవీ విస్తీర్ణం ప్రమాదకర స్థాయిలో తగ్గుతోందని, అడవుల నరికివేతను అడ్డుకోవడంతో పాటు, ప్రకృతి పునరుద్ధరణలో విరివిగా మొక్కలు నాటాలని జాదవ్ అన్నారు. కార్యక్రమానికి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మద్దతును ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రకృతిని కాపాడేందుకు అస్సాం ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని, మహిళా సంఘాలకు రూ.10వేల ప్రోత్సాహం ఇస్తూ మొక్కలు నాటిస్తూ, వాటి పెంపకం బాధ్యత అప్పగించామని ఎమ్మెల్యే జోలెన్ దోయినరీ తెలిపారు. కార్యక్రమంలో తముల్‌పూర్ కలెక్టర్ బీ బికాస్ భగవత్, ఇగ్నైటింగ్ మైండ్స్ నుంచి రీతురాజ్ పుకాన్, నవోదయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధులు కరుణాకర్ రెడ్డి, రాఘవ పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ రాజీనామా నిర్ణయం ప్రచార ఎత్తుగడే!

**ఢిల్లీ:** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆరు నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ ఆదివారం పార్టీ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించారు. తాను నిజాయితీపరుడినని ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ సీఎం పగ్గాలు చేపట్టబోనని చెప్పారు. ఇక కేజ్రీవాల్ ప్రకటన పబ్లిసిటీ స్టంట్, ఎన్నికల ఎత్తుగడ మాత్రమేనని కాంగ్రెస్, బీజేపీలు తప్పుపట్టాయి. ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేస్తానని కేజ్రీవాల్ చేసిన ప్రకటన పబ్లిసిటీ స్టంట్ మాత్రమేనని, తన ఇమేజ్‌ను కాపాడుకునే ప్రయత్నంలో భాగమేనని బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి అన్నారు. ఢిల్లీ వాసుల్లో కేజ్రీవాల్ అవినీతిపరుడనే ముద్ర పడుతోందని గ్రహించినందునే దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఇక కేజ్రీవాల్ సీఎం పదవి నుంచి తప్పుకోవడం త్యాగమేమీ కాదని, సీఎం కార్యాలయంలోకి తిరిగి ప్రవేశం, ఫైళ్లపై సంతకాలు చేయరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని బీజేపీ నేత మణిందర్ సింగ్ సిర్సా పేర్కొన్నారు. తదుపరి సీఎంగా తన భార్య సునీతా కేజ్రీవాల్‌ను ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలను ఒప్పించేందుకే సీఎం రెండు రోజుల గడవుతు తీసుకున్నారని స్పష్టం చేశారు. ఇక సీఎం నిర్ణయం కేవలం ప్రచార ఎత్తుగడని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ అభివర్ణించారు. ఆయన ఎప్పుడో రాజీనామా చేయాల్సి ఉందని వ్యాఖ్యానించారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత సీఎంఓకు తిరిగివచ్చి ఫైళ్లపై సంతకాలు చేయరాదని ఓ సీఎంను సుప్రీంకోర్టు కోరడం ఇదే తొలిసారని గుర్తుచేశారు. ఆధారాలను మాయం చేసే అవకాశం ఉందనే కోర్టు ఆందోళన ఈ ఉత్తర్వుల్లో కనిపిస్తోందని అన్నారు. కేజ్రీవాల్‌ను సుప్రీంకోర్టు నేరస్తుడిగా పరిగణిస్తున్నదని ఆరోపించారు. లిక్కర్ పాలసీ కేసులో జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఈనెల 13న షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

## సీఎం పదవిపై కేజ్రీవాల్‌కు మోజు లేదు

**ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్**



**ఢిల్లీ:** ఢిల్లీ సీఎం పదవికి రెండ్రోజుల్లో రాజీనామా చేస్తానని అరవింద్ కేజ్రీవాల్ పార్టీ సమావేశంలో చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. కేజ్రీవాల్ కీలక ప్రకటన నేపథ్యంలో ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాం నివాస్ గోయల్ సీఎంను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాను కేజ్రీవాల్‌ను కలిశానని, ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేయాలనే ఆయన ప్రతిపాదనపై చర్చలు జరిపామని గోయల్ వెల్లడించారు. సీఎం కుర్చీపై కేజ్రీవాల్‌కు మోజు లేదని, ఆయన మంచి నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. కేజ్రీవాల్ నిజాయితీపరుడని ఢిల్లీ ప్రజలు విశ్వసిస్తే ఆయనకు తిరిగి సీఎంగా పట్టం కడతారని అన్నారు. సెప్టెంబర్‌లో ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉందని స్పీకర్ తెలిపారు. ఇక, ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆరు నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన కేజ్రీవాల్ ఆదివారం పార్టీ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించారు. తాను నిజాయితీపరుడినని ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ సీఎం పగ్గాలు చేపట్టబోనని చెప్పారు. కాగా కేజ్రీవాల్ సంచలన ప్రకటనపై పార్టీ సీనియర్ నేత రాఘవ్ చద్దా స్పందించారు. కేజ్రీవాల్ తన పదవిని త్యజించి అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు. ఆప్‌నకు ఓటు వేయడం ద్వారా కేజ్రీవాల్ నిజాయితీపరుడని ఢిల్లీ ప్రజలు నిర్ధారించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ దీవార్ మూవీలోని సన్నివేశాన్ని తలపిస్తూ ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ అమాయకుడని తమ చేతిపై రాసుకోవాలని చద్దా కోరారు.

## ప్రధాని రేసులో ఉంటే మద్దతిస్తామని ప్రతిపక్షం ఆఫర్ ఇచ్చింది!

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు..!**



**నాగ్పూర్:** కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ప్రధానిగా రేసులో నిలిస్తే మద్దతు ఇస్తామంటూ ప్రతిపక్షం ఆఫర్ ఇచ్చిందని.. అయితే, తాను ఆ ఆఫర్‌ని తిరస్కరించానన్నారు. ప్రధానిమంత్రి కావడం తన ఆశయం కాదని చెప్పానన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన జర్నలిస్టుల అవార్డుల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఓ సంఘటన గుర్తుందని.. తాను ఎవరి పేరు చెప్పడం లేదన్నారు. మీకు ప్రధానమంత్రి కావాలని అనుకుంటే మద్దతిస్తామని చెప్పారన్నారు. తనకు మీరు నాకు ఎందుకు మద్దతు ఇవ్వాలి ? నేను ఎందుకు మీ మద్దతు తీసుకోవాలని ప్రశ్నించానన్నారు. పీఎం కావడం తన జీవితాశయం కాదని.. విశ్వాసానికి.. తన సంస్థకు విధేయుడినన్నారు. ఈ విషయంలో తాను రాజీపడనన్నారు. పదవి కంటే విశ్వాసం చాలా ముఖ్యమైందని గడ్కరీ అభిప్రాయపడ్డారు. రాజకీయాలతో పాటు జర్నలిజంలోనూ నైతిక విలువలు పాటించాలని గడ్కరీ సూచించారు. కమ్యూనిస్ట్ నేత ఏబీ బర్ధన్ ఆర్ఎస్ఎస్ వ్యతిరేకి అయినా.. ఆయనను గౌరవించాలని గడ్కరీ సూచించారు. నాగ్‌పూర్-విదర్భ ప్రాంతానికి చెందిన కీలక రాజకీయ నేతల్లో ఆయన ఒకరన్నారు. నిజాయితీ గల ప్రతిపక్షాన్ని గౌరవించాలని.. ఓ సీపీఐ నేతకు ఇదే విషయాన్ని చెప్పినట్లు గడ్కరీ తెలిపారు. నిజాయితీ లేని వ్యక్తికి గౌరవం అక్కర్లేదన్నారు. కామ్రేడ్ బర్ధన్ తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని, ప్రస్తుతం రాజకీయాలతో పాటు జర్నలిజంలో అలాంటి వ్యక్తులు లేరని గడ్కరీ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక, శాసనసభ, మీడియా అనే నాలుగు స్తంభాలు నిజాయితీగా నడిచిన సమయంలోనే ప్రజాస్వామ్యం విజయం సాధిస్తుందని అభిప్రాయపడ్డారు.

## హరియాణ సీఎం రేసులో ఉన్నా: అనిల్ విజ్



**చండీగఢ్:** సీనియర్ బీజేపీ నేత, మాజీ మంత్రి అనిల్ విజ్ హరియాణ సీఎం పీఠంపై కన్నేశారు. తాను పార్టీలో సీనియర్‌నని, రానున్న హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే తాను సీఎం రేసులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. హరియాణ ప్రస్తుత సీఎం నయబ్ సింగ్ సైనీ పార్టీ సీఎం అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే ప్రకటించిన క్రమంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్ విజ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.అనిల్ విజ్ ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తానిప్పటి వరకూ పార్టీ నుంచి ఏమీ కోరలేదని, కానీ ఇప్పుడు తన సీనియరిటీ ప్రకారం సీఎం పదవిని తాను కోరుతున్నానని చెప్పారు. హరియాణ ప్రజలు తనను కలిసేందుకు వస్తున్నారని, తన నియోజకవర్గమైన అంబాలా ప్రజలు సైతం సీనియర్ నేత అయిన మీరు అత్యున్నత పదవి చేపట్టాలని కోరుతున్నారని తెలిపారు. ప్రజల కోరిక మేరకు, తన సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని సీఎం పదవికి తనను పరిశీలించాలని ఈసారి తాను కోరతానని చెప్పారు.పార్టీ నాయకత్వం తనకు హరియాణ సీఎం పదవి అప్పగిస్తే హరియాణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేస్తానని తెలిపారు. కాగా మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా అనంతరం నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వం ఇటీవల కొలువుతీరిన క్రమంలో అనిల్ విజ్‌కు సైనీ క్యాబినెట్‌లో స్థానం దక్కని సంగతి తెలిసిందే. ఇక అనిల్ విజ్‌ను అంబాలా కంటోన్మెంట్ నుంచి బీజేపీ బరిలో దింపగా పార్టీ సీనియర్ నేతల సమక్షంలో ఈనెల 11న ఆయన నామినేషన్ దాఖలు చేశారు.

## మేం అధికారంలోకి రాగానే మద్య నిషేధాన్ని ఎత్తేస్తాం: ప్రశాంత్ కిషోర్



**పాట్నా:** బీహార్‌లో తమ పార్టీ అధికారంలోకి రాగానే మద్య నిషేధాన్ని రద్దు చేస్తామని జన్ సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ హామీ ఇచ్చారు. అక్టోబర్ 2న తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏర్పాట్లను వివరిస్తూ ఆయన ఈ విషయం చెప్పారు. పీకే మీడియాతో మాట్లాడుతూ.. జన్ సురాజ్ ప్రభుత్వం ఏర్పడితే అధికారంలోకి వచ్చిన గంటలోపే బీహార్‌లో ఉన్న మద్యపాన నిషేధాన్ని ఎత్తేస్తామని వ్యాఖ్యానించారు. అందుకోసం తాము రెండు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నామని చెప్పారు.రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వి యాదవ్ రాష్ట్రంలో చేపట్టిన యాత్రపై పీకే మాట్లాడుతూ.. ఆయన కనీసం ఇప్పటికైనా ఇంటి నుంచి బయటకువచ్చి ప్రజల మధ్యకు వెళ్లడం మంచి పరిణామమే అన్నారు. తేజస్వి యాదవ్, సీఎం నితీశ్ కుమార్ వల్ల రాష్ట్రానికి నష్టం తప్ప ప్రయోజనం ఏమీ లేదని వ్యాఖ్యానించారు. బీహార్ ప్రజలు 30 ఏళ్లుగా వారిని భరిస్తున్నారని అన్నారు. ఇకనైనా వారు బీహార్‌ను విడిచిపెట్టాలని సూచించారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. బీహార్‌లో 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం ఉన్నప్పటికీ అభివృద్ధి సూచీల్లో వెనుకబడి ఉందని తేజస్వీ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఆయన రాజకీయ నాయకుడు కావడానికి ఏకైక కారణం మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు కావడమే అని ఎద్దేవా చేశారు. కాగా బీహార్‌లో 2016 ఏప్రిల్ నుంచి మద్య నిషేధం అమల్లో ఉన్నది.

## కొత్తగా ఆరు వందే భారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ



**అహ్మదాబాద్:** ప్రధాని నరేంద్రమోదీ కొత్తగా ఆరు వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. ఆదివారం ఆ రైళ్లను వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఆరు రైళ్లు టాటానగర్ – పట్నా, బ్రహ్మపూర్ – టాటానగర్, రూర్కెలా – హౌరా, డియోగఢ్ – వారణాసి, భాగల్పూర్ – హౌరా, గయా – హౌరా మార్గాల్లో ప్రయాణికులకు సేవలు అందించనున్నాయి. వందే భారత్ రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటికే 24 రాష్ట్రాలు, పలు కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిత్యం 120 ట్రిప్పులతో ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో వివిధ రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు.

## నేడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర సచివాలయం ముందు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆవిష్కరించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.సచివాలయానికి ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని ఎప్పటి నుంచో ప్రతిపాదన ఉంది. అలాంటి చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడమంటే ఆత్మగౌరవం మీద దాడిచేసినట్టేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్న విషయం విదితమే. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు తెలంగాణకు రాజీవ్ గాంధీకి ఏం సంబంధం ఉందని విగ్రహం పెడుతున్నారంటూ ప్రశ్నించారు. వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా అంటూ కేటీఆర్ నిలదీశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మనసు మార్చుకుని అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము అధికారంలోకి వచ్చాక రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి.. తెలంగాణ తల్లి విగ్రహం పెడతామన్నారు. సకల మర్యాదలతో రాజీవ్‌గాంధీ విగ్రహం అక్కడి నుంచి తరలిస్తామని తెలిపారు. అధికారంలో ఉన్నామని ఏదైనా చేస్తారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమని.. ఇప్పుడు విగ్రహం పెట్టినా అధికారంలో వచ్చాక దానిని వెంటనే తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ స్పష్టంచేశారు. అంతే కాకుండా తెలంగాణలో రాజీవ్ పేరుతో ఉన్న రింగ్ రోడ్డు, హైదరాబాద్ విమానాశ్రయం సహా ఇతర సంస్థల పేర్లూ మారుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఇందిరా, రాజీవ్ పేర్లతో హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయని.. కాంగ్రెస్ ఇప్పటికైనా మారకుంటే అధికారంలోకి వచ్చాక అన్ని పేర్లు మారుస్తామని కేటీఆర్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

## సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో బ్యాగ్ కలకలం



**విశ్వంభర, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో బ్యాగ్ కలకలం సృష్టించింది. అప్రమత్తమైన చీఫ్ సెక్యూరిటీ వింగ్ అధికారులు బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద బ్యాగ్‌ను అధికారులు తరలించి తనిఖీ చేస్తున్నారు.ఈ పరిస్థితుల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం ఇంటి వైపు వచ్చే వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఆ పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

## నాగం జనార్ధన్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగం జనార్దన్ రెడ్డినిబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ఆర్ పరామర్శించారు. కొద్ది రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడిన ఆయన చికిత్స అనంతరం కోలుకున్నారు. విషయం తెలుసుకున్న కేటీఆర్ గచ్చిబౌలిలోని నాగం జనార్ధన్ రెడ్డి నివాసానికి చేరుకొని నాగంను పరామర్శించి, ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు. కేటీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.



# రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

పోరాడతామన్నారు.త్వరలోనే వారు బయటకు వస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించిన సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహార్ జైలు నుంచి రిలీజయ్యారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. కుట్రపై సత్యం విజయం సాధించిందని చెప్పారు. దేశాన్ని విభజిస్తున్న శక్తులపై తన పోరాటం ఆగదని ఆయన ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు.

**త్వరలో కొత్త సీఎం ఎంపిక...**

అయితే ఆప్ నుంచి మరొకరు సీఎం అవుతారని, కొత్త సీఎం ఎంపిక కోసం రెండు, మూడ్రోజుల్లో పార్టీ సమావేశం నిర్వహిస్తామని కేజ్రీవాల్ తెలిపారు. ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. "మా పార్టీని ముక్కలు చేసేందుకే నన్ను జైలుకు పంపారు. కానీ ఎన్ని ఎత్తులు వేసినా పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది. నన్ను జైల్లో పెట్టి ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా రాజ్యాంగాన్ని రక్షించాలనే ఇన్నాళ్లు రాజీనామా చేయలేదు. జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడపకూడదని సుప్రీం కోర్టే ప్రశ్నించింది. ప్రభుత్వాన్ని నడపవచ్చని వెల్లడించింది" అని కేజ్రీవాల్ అన్నారు.మద్యం విధానానికి సంబంధించిన సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. దీంతో దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్, కుట్రపై సత్యం విజయం సాధించిందని అన్నారు. దేశాన్ని బలహీన పరుస్తున్న, విభజిస్తున్న శక్తులపై తన పోరాటం ఆగదని పేర్కొన్నారు. ఇప్పుడు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



# కౌన్ బనేగా నెక్స్ట్ ఢిల్లీ సీఎం?



- రేసులో ప్రముఖంగా నలుగురి పేర్లు
- వేడెక్కిన ఢిల్లీ రాజకీయాలు

**ఢిల్లీ:** మరో రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. దీంతో ఢిల్లీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ క్రమంలో ఢిల్లీ సీఎం పదవిని కేజ్రీవాల్ ఎవరికి అప్పగిస్తారనే విషయంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది. సీఎం రేసులో కేజ్రీవాల్ భార్య సునీత, మంత్రులు అతిషి, కైలాష్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, ముందస్తు ఎన్నికలకు వెళ్తారా..? లేదంటే సీఎం పదవి నుంచి తప్పుకొని మరొకరికి బాధ్యతలు అప్పగిస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. అయితే, ప్రస్తుతం కేజ్రీవాల్ తన స్థానంలో మరో ఆప్ నేతకు సీఎంగా ఛాన్స్ ఇవ్వనున్నారు. ఇదే జరిగితే ఎవరు సీఎంగా ప్రమాణం చేస్తారన్న విషయంపై ఉత్కంఠ నెలకొన్నది. త్వరలోనే ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరుగనున్నది. ఇందులో సీఎల్పీ లీడర్‌ను ఎన్నుకునే అవకాశం ఉంది.మరి వీరిలో ఎవరికి కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరికి అప్పగించే అవకాశం ఉంది? ఢిల్లీ రాజకీయ సమీకరణాలు ఏంటి? కేజ్రీవాల్ వ్యూహాలు ఏంటి? తదితర విషయాలు తెలుసుకుందాం.

ముఖ్యమంత్రి పదవి రేసులో నలుగురు ప్రముఖ పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో విద్యాశాఖ మంత్రి అతిషి మర్లెనా, ఆరోగ్యశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్, కైలాష్ గహ్లోత్‌తో పాటు సునీత్రా కేజ్రీవాల్ పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి.

**ఎవరికి సీఎం పీఠం!**

ఢిల్లీ సీఎం బాధ్యతలను కేజ్రీవాల్ తన భార్య సునీతకు అప్పగిస్తారనే చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల నుంచి సునీత సీఎం పీఠాన్ని అధిరోహిస్తారని ఊహాగానాలు వినిపించాయి. దేశంలోని ఇతర రాజకీయ ప్రాంతీయ పార్టీల మాదిరిగానే సీఎం పదవిని కేజ్రీ తన కుటుంబ సభ్యులకే అప్పగిస్తారా? లేదా ఇతరులకు అవకాశం ఇస్తారా? అనే దానిపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బిహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ తాను జైలుకు వెళ్లిన సమయంలో తన భార్య రబ్రీ దేవీకి సీఎం పీఠాన్ని అప్పగించారు. ఝార్ఖండ్‌లో శిబూ సోరెన్ తన కుమారుడు హేమంత్‌కు పగ్గాలు అప్పగించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో ములాయం సైతం తన కుమారుడు అఖిలేశ్ యాదవ్‌కే పార్టీ నాయకత్వ బాధ్యతలు ఇచ్చారు. కేజ్రీ కూడా ఇలాగే చేస్తారా? పార్టీలోకి ఇతరులకు సీఎం పగ్గాలు అప్పగిస్తారా? అనే చర్చ జరుగుతోంది.

**ఇతర నేతలవైపే మొగ్గు!**

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితిలో ప్రతిపక్షాల ఆరోపణలను ఎదుర్కొవడానికి కేజ్రీవాల్ తన భార్యకు కాకుండా ఇతరులకు సీఎం పదవి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ తన భార్య సునీతకు సీఎం పదవి ఇస్తే, ఇతర ప్రాంతీయ పార్టీలలానే ఆప్ కూడా కుటుంబ పార్టీ అని ముద్ర పడుతుంది. కేజ్రీవాల్ బంధుప్రీతిని ప్రోత్సహిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శలు చేసే అవకాశం ఉంది.

**అతిషి మర్లెనా..**

ప్రస్తుత విద్యాశాఖ మంత్రి అతిషి మర్లెనా సీఎం రేసులో ఉన్నారు. ఢిల్లీ సీఎం రేసులో మంత్రి అతిషి పేరు బలంగా వినిపిస్తోంది. కేజ్రీవాల్ మద్యం పాలసీ కేసులో అరెస్టయిన సమయంలో ఆమె ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వం, పార్టీకి సంబంధించిన అన్ని వ్యవహారాల్లోనూ ముందున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కేజ్రీవాల్‌కు బదులుగా జాతీయ జెండాను ఎగుర వేసేందుకు అతిషి పేరును కేజ్రీవాల్ ప్రతిపాదించారు. ఈ క్రమంలో ఆమె అభ్యర్థిత్వాన్ని మరింత బలపరుస్తున్నది.

**సౌరభ్ భరద్వాజ్..**

సీఎం పదవి రేసులో సౌరభ్ భరద్వాజ్ ఉన్నారు. ఆయన కేజ్రీవాల్ కేబినెట్‌లో ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీలో ఆయన కీలక నేతల్లో ఒకరు. ఆయన కేజ్రీవాల్‌కు సన్నిహిత మిత్రుడు. ఆయన జైలులో ఉన్న సమయంలో చురుగ్గా వ్యవహరించారు. పార్టీ వేదికలు, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ తన ఉనికిని చాటుకున్నారు. ప్రభుత్వంలో సౌరభ్ ఏడుశాఖలకు మంత్రిగా ఉన్నారు. ఈ క్రమంలో ఆయన సైతం పోటీదారుగా ఉన్నారు.

**కైలాష్ గెహ్లాట్..**

కైలాష్ గెహ్లాట్ కేజ్రీవాల్‌కు కీలక సహచరుడు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎనిమిది శాఖల బాధ్యతలను చూసుకుంటూ వస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీలోనూ కీలక బాధ్యతలు చేసుకుంటూ వస్తున్నారు. పార్టీలో ఆయన కూడా అగ్రనేత. ఈ క్రమంలో కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకోవడంతో బాధ్యతలను కైలాష్ గహ్లోత్‌కు సీఎంగా ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. అలాగే మంత్రులు గోపాల్ రాయ్, ఇమ్రాన్ ఖాన్ కూడా సీఎం రేసులో ఉన్నారు. సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా పేర్లు తక్కువగా వినిపిస్తున్నాయి. అయితే ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకే కొన్నినెలలపాటు ఢిల్లీకి ఆపద్ధర్మ ముఖ్యమంత్రి అవసరం. ఈ నేపథ్యంలో దళితుల ఓట్లను రాబట్టుకునేందుకు కేజ్రీవాల్ ఆప్‌లో దళిత నేతలైన కులదీప్ కుమార్, గిరీశ్ సోనీ పేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. సీఎం రేసులో మనీశ్ సిసోదియా ఉన్నప్పటికీ, ఆయన ఆ పదవిని అధిష్ఠించరని కేజ్రీవాల్ ఓ ప్రకటనలో తెలిపారు. తనకు, మనీశ్ సిసోదియాకు ప్రజలు ఓట్లు వేసి నిజాయితీ సర్టిఫికెట్ ఇచ్చే వరకు తాను సీఎం కుర్చీపై కూర్చోబోనని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సిసోదియా కూడా సీఎం రేసులో లేనట్లు తేలిపోయింది. మరో రెండు రోజుల్లో ఢిల్లీ కొత్త సీఎం ఎవరో తేలిపోనుంది.

**'అదొక డ్రామా'...**

మరోవైపు, కేజ్రీవాల్ రాజీనామా ప్రకటనపై బీజేపీ, కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తున్నాయి. కేజ్రీవాల్ రాజీనామా ప్రకటనను డ్రామాగా అభివర్ణించారు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సందీప్ దీక్షిత్. కేజ్రీవాల్ చాలా కాలం క్రితమే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఉండాల్సిందని విమర్శించారు. ఒక పదవిలో ఉన్న వ్యక్తి జైలుకు వెళ్లి, బెయిల్ పొందిన తర్వాత ఏ ఫైల్‌ను ముట్టుకోవద్దని కోర్టు చెప్పడం చరిత్రలో ఇది మొదటిసారి కావచ్చని ఎద్దేవా చేశారు. సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసే సమయంలో సుప్రీం కోర్టు విధించిన షరతులేవీ ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జైలు నుంచి విడుదల విషయంలో విధించలేదని తెలిపారు. మరోవైపు, ఫైళ్లపై సంతకం చేయలేనప్పుడు కేజ్రీవాల్ సీఎంగా ఉండి ఏం లాభమని బీజేపీ సీనియర్ నేత మంజీందర్ సింగ్ సిర్సా ఆరోపించారు.

## సంపద సృష్టిస్తున్నాం.. ప్రజలకు పంచుతున్నాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్:** "పదేళ్ల పాటు కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో పోరాడారు. భారాస ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, కాంగ్రెస్ కార్యకర్తలు భయపడలేదు" అని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశకుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు నుంచే హామీలు అమలు ప్రారంభించామన్నారు. "మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ప్రతి నెలా రూ.400 కోట్లు చెల్లిస్తున్నాం. ఒకే విడతలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించాం. ప్రజల కోసం సంపద సృష్టిస్తున్నాం.. మళ్లీ ప్రజలకు పంచుతున్నాం"అని వివరించారు.

**కష్టపడ్డవారిని పార్టీ గుర్తుపెట్టుకుంటుంది: మంత్రి ఉత్తమ్..**

"సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మరోసారి రుజువైంది. వెనుకబడిన కులాలకు కాంగ్రెస్ ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. కార్యకర్తల శ్రమ, త్యాగం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కష్టపడి పనిచేసిన వారిని పార్టీ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని మరోసారి రుజువైంది. 2029లో రాహుల్ గాంధీ కచ్చితంగా ప్రధాన మంత్రి అవుతారు" అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

## కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



**విశ్వంభర, చేర్యాల:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మల్లన్న స్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది. స్వామి వారి ఉత్సవాలు ముగిసినప్పటికి పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 12వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీశర్మ తెలిపారు.శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

## ప్రపంచంలోనే మన ఖైరతాబాద్ వినాయకుడు ఫేమస్: హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్ :** భారతీయ సంస్కృతి చాలా గొప్పది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన తెలిపారు. ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్న సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు.ప్రపంచంలోనే మన ఖైరతాబాద్ వినాయకుడు ఫేమస్. ఒకప్పుడు వినాయక చవితి అంటే ముంబై గుర్తుకు వచ్చేది.. కానీ ఇప్పుడు దేశమంతా ఒకటే మాట అంటున్నది.. ఖైరతాబాద్ గణేశ్ మహారాజ్‌కి జై అంటున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద వినాయకుడి విగ్రహాన్ని తయారు చేసే ఘనత మన ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు దక్కింది. మనం ఇంట్లోనే చిన్న పూజ చేయాలంటేనే ఎన్నో ఇబ్బందులు పడుతాం. కానీ 70 ఏండ్ల నుంచి ఇంత భారీ స్థాయిలో గణేశ్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారంటే ఖైరతాబాద్ గణేశ్ నిర్వాహకుల కృషి గొప్పదని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. భారతీయ సంస్కృతి చాలా గొప్పది. భిన్నత్వంలో ఏకత్వం.. ఏకత్వంలో భిన్నత్వం ఉన్న సంస్కృతి మనది. మనకు ఏదైనా సమస్య వస్తే అందరం ఒక్కటై కదులుతాం.. అదే భారతీయ సంస్కృతి అని హరీశ్‌రావు తెలిపారు. దసరా అయినా, దీపావళి అయినా, బతుకమ్మైనా, బోనాలైనా, శ్రీరామనవమి అయినా, వినాయక చవితి అయినా అందరం కలిసి గొప్పగా జరుపుకునే సంస్కృతి భారతీయులకు ఉంది. ఈ సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మనందరం వినాయక చవితి అనగానే ఒక జోష్ ప్రోగ్రామ్ అనుకుంటాం. కానీ ఎమోషన్ కూడా ఈ పండుగలో ఉంది. ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో బాలగంగాధర్ తిలక్ దేశ ప్రజలందరినీ ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలు స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు నడిపించాయి. ఆ సంస్కృతిని మనందరం కొనసాగిస్తున్నాం. రాబోయే రోజుల్లో కూడా ఈ సంస్కృతిని కొనసాగిద్దామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఇవాళ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అకాల వర్షాలు, వరదలు రావడంతో ప్రజలు బాధ పడుతున్నారు. ఈ విఘ్నేశ్వరుడు రాష్ట్ర ప్రజలకు విఘ్నాలు తొలగించి, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతున్నాను. కేసీఆర్ నాయకత్వంలో 9 ఏండ్ల పాటు గణేశ్ ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించుకున్నాం. అదే పద్ధతిలో నిమజ్జన వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలి. ఈ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంత జనం ఉన్నారు. మిమ్మల్ని చూస్తుంటే సంతోషంగా ఉందని హరీశ్‌రావు తన ప్రసంగాన్ని ముగించారు.





# ఐసీసీ అంపైర్‌గా తొలి పాకిస్థానీ మహిళా క్రికెటర్

విశ్వంభర (క్రీడావిభాగం): పాకిస్థాన్‌కు చెందిన మాజీ మహిళా క్రికెటర్ సలీమా ఇంతియాజ్ చరిత్ర సృష్టించింది. ఐసీసీ అంపైర్ల ప్యానెల్ కు నామినేట్ అయింది. దాంతో, ఈ ఘనత సాధించిన తొలి పాకిస్థాన్ మహిళా క్రికెటర్‌గా సలీమా రికార్డు నెలకొల్పింది. ఇకపై ఆమె అంతర్జాతీయ వేదికలపై మహిళల క్రికెట్ మ్యాచ్‌లో అంపైర్‌గా వ్యవహరించనుంది. తనకు ఈ గొప్ప అవకాశం దక్కడం పట్ల సలీమ సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సలీమాను అభినందిస్తూ ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ చేసింది. 'అంతర్జాతీయ మ్యాచుల్లో పాకిస్థాన్ ప్రతినిధిగా ఉండాలనే నా కల నెరవేరింది. ఇది నా ఒక్కదాని విజయం మాత్రమే కాదు అంపైర్ అవ్వాలనుకుంటున్న పాకిస్థాన్‌లోని ప్రతి మహిళా క్రికెటర్ విజయం. నేను సాధించిన ఈ ఘనత దేశంలోని అమ్మాయిల్లో స్ఫూర్తిని నింపి, వాళ్లు ఆటల్లో రాణించే విధంగా ఉపయోగపడుతుందని నా నమ్మకం' అని సలీమా చెప్పింది. అంతేకాదు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మహిళా అథ్లెట్లను, అధికారులను ప్రోత్సహిస్తుందని ఆమె వెల్లడించింది. తనకు ఇంతకుముందు ఆసియా క్రికెట్ కౌన్సిల్ నుంచి కూడా అంపైర్‌గా అవకాశాలు వచ్చాయని సలీమా చెప్పింది. మాజీ క్రికెటర్ అయిన సలీమా 2008లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అంపైర్స్ ప్యానెల్‌లో చేరింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకున్న కూతురు కైనత్ క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుంది. 2010లో అరంగేట్రం చేసిన కైనత్ ఇప్పటివరకూ 40 మ్యాచులు ఆడింది. వాటిలో 19 వన్డేలు, 21 టీ20లు ఉన్నాయి.

# ములానీ ఆల్‌రౌండ్ షోతో మయాంక్ సేన

- 186పరుగుల తేడాతో ఇండియా డీ పై ఇండియా ఏ విజయం
- ఇండియా బీని పడగొట్టిన కంబోజ్
- ఇండియా బీ, ఇండియా సీల మ్యాచ్ డ్రా



విశ్వంభర (క్రీడావిభాగం): దులీప్ ట్రోఫీలో 'ఇండియా ఏ' ఘన విజయం సాధించింది. తొలి రోజు నుంచి అదరగొట్టిన మయాంక్ అగర్వాల్ సేన 'ఇండియా డీ'పై 186 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత తెలుగు కుర్రాడు తిలక్ వర్మ(111), ప్రథమ్ సింగ్(122)లు సెంచరీలతో ఇండియా డీ బౌలర్ల భరతం పట్టారు. ఆ తర్వాత బంతి అందుకున్న తనుష్ కొతియాని(4/73), శామ్స్ ములానీ(3/117)లు ఇండియా డీని కుప్పకూల్చారు.ఇండియా ఏ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న రికీ భూయి(113) సెంచరీ కొట్టినా జట్టుకు ఓటమి తప్పించలేకపోయాడు. బ్యాటుతో, బంతితో రాణించిన శామ్స్ ములానీ(89, 3/117) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఇండియా బీ, ఇండియా సీల మధ్య ఉత్కంఠ సాగిన మ్యాచ్ చివరికి డ్రాగా ముగిసింది.

**తిలక్, ప్రథమ్ శతకగర్జన..**

దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో 'ఇండియా ఏ' దుమ్మురేపింది. ఇప్పటివరకూ టీ20ల్లో దంచేసిన తిలక్ వర్మ(111) రెడ్ బాల్ క్రికెట్‌లోనూ వీర కొట్టుడు కొట్టాడు. మరో ఎండ్‌లో ప్రథమ్ సింగ్(122) కూడా రెచ్చిపోయి ఆడాడు. దాంతో రెండో ఇన్నింగ్స్‌ను ఇండియా ఏ 380 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా డీని యశ్ దూబే(37), రికీ భూయి (113)లు ఆదుకున్నారు. రెండో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యంతో గెలుపు దిశగా నడిపారు. అయితే.. కొతియాన్, ములానీల విజృంభణతో ఇండియా డీ మిడిలార్డర్ పెవిలియన్ చేరింది. సంజూ శాంసన్(40) చివర్లో పోరాడినా సరిపోలేదు.

**నడ్డి విరిచిన కంబోజ్**

ఉత్కంఠగా సాగిన ఇండియా బీ, ఇండియా సీల మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలుత ఇషాన్ కిషన్(111) విధ్వంసక సెంచరీ, మానవ్ సుతార్ (82), బాబా ఇంద్రజిత్(78), రుతురాజ్ గైక్వాడ్(58)ల వీరబాదుతో ఇండియా సీ తొలి ఇన్నింగ్స్‌లో 525 రన్స్ కొట్టింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా బీని కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(157 నాటౌట్) ఆదుకున్నాడు.

**అభిమన్యు ఈశ్వరన్(157 నాటౌట్)**

తొలి వికెట్‌కు జగదీశన్(74)తో కలిసి 129 రన్స్ జోడించిన అభిమన్యు పటిష్ఠ స్థితిలో నిలిపాడు. అయితే.. ఆ తర్వాత అతడికి సహకరించేవాళ్లు కరువయ్యారు. పేసర్ అన్షుల్ కంబోజ్ 8 వికెట్లతో ఇండియా బీ నడ్డి విరిచాడు. అతడి దెబ్బకు అభిమన్యు బృందం 332 పరుగలకే ఆలౌటయ్యింది. ఆ తర్వాత ఇండియా సీ 128 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.



# వీడ్కోలు పలకాలనే ఆలోచన అయితే రాలేదు: అశ్విన్

విశ్వంభర(క్రీడావిభాగం): భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మళ్లీ బంతితో మాయ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. చెన్నైలో బంగ్లాదేశ్‌తో జరుగనున్న తొలి టెస్టు కోసం అశ్విన్ నెట్స్‌లో బౌలింగ్ సాధనలో మునిగిపోయాడు. సొంత మైదానంలో చెలరేగిపోవాలని భావిస్తున్న ఈ ఆఫ్ స్పిన్నర్ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఇంకెన్ని రోజులు క్రికెట్ ఆడుతారు? మీ భవిష్యత్ ప్రణాళికలు ఏంటీ?' అనే ప్రశ్నలకు అశ్విన్ నిజాయతీగా సమాధానం చెప్పాడు.చెపాక్‌లో బంగ్లాదేశ్‌తో టెస్టు సన్నద్ధతలో ఉన్న అశ్విన్ యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడాడు. ఈ సందర్భంగా అతడు తన మనసులో ఉన్నది ఉన్నట్టు చెప్పేశాడు. 'ఇప్పటికైతే క్రికెట్ నుంచి వైదొలగాలనే ఆలోచన నాకు ఏమాత్రం లేదు. ప్రస్తుతానికి నేను ఏరోజు కారోజు మీదనే దృష్టి పెడుతున్నా. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ ప్రతిరోజు అదనంగా శ్రమించాల్సి ఉంటుంది. గత 3 నుంచి 4 ఏండ్లలో నేను ఎంతో కష్టపడ్డాను.అందుకనే కాబోలు నాకు వీడ్కోలు పలకాలనే ఆలోచన అయితే రాలేదు. అయితే.. ఇంకా మెరుగవ్వకూడదను అని అనుకున్న రోజున క్రికెట్‌ను వదిలేస్తా. ఇంకేం ఆలోచించను. అదే రోజు క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతా' అని అశ్విన్ వెల్లడించాడు. అంతేకాదు 40 ఏండ్లు వచ్చేంత వరకూ ఆడుతారా? అనే ప్రశ్నకు అశ్విన్ ఏమో చెప్పలేను అంటూ సమాధానమిచ్చాడు.'ఫలానా వయసు వచ్చేంత వరకూ ఆడాలని లక్ష్యం అంటూ ఏదీ పెట్టుకోలేదు. అయితే.. లెజెండరీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే తన రికార్డు(619 వికెట్లు)ను నేను బద్ధలు కొట్టాలని భావిస్తున్నాడు. అయితే.. అది నా వల్ల అవుతుందా? లేదా? అనేది చెప్పలేను.ఏది ఏమైనా క్రికెట్‌ను ప్రేమిస్తూనే ఉంటాను' అని అశ్విన్ తెలిపాడు. ఈమధ్యే వందో టెస్టు క్యాప్ అందుకున్న అశ్విన్ భారత విజయాల్లో ముఖ్య భూమిక పోషిస్తూ వస్తున్నాడు. 2011 నవంబర్‌లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన ఈ స్పిన్ మాంత్రికుడు ఇప్పటివరకూ 516 వికెట్లు పడగొట్టాడు.

## రెండతస్థుల బాల్కనీ నుంచి కిందపడి..

# ఐసీయూలో ఫుట్‌బాలర్

దుబాయ్: సౌదీ అరేబియా ఫుట్‌బాలర్ ఫహద్ అల్ మువల్లాద్ అనూహ్యంగా దవాఖాన పాలయ్యాడు. దుబాయ్‌లోని రెండస్థుల భవనం బాల్కనీపై నుంచి ఫహద్ కిందపడి ఐసీయూలో చేరాడు. కొన్ని రోజుల విహారం కోసం దుబాయ్‌కు వచ్చిన అతడు ఓ అపార్ట్‌మెంట్‌లో బస చేశాడు. అయితే.. గురువారం అతడు బాల్కనీ నుంచి ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని వెంటనే ఇరుగుపొరుగువాళ్లు హాస్పిటల్‌కు తరలించారు.గాయాల తీవ్రత దృష్ట్యా ఫహద్‌కు వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారురు. ప్రస్తుతం అతడ ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే.. ఫహద్ తనంతట తానే కాలు జారి కింద పడ్డాడా? మరెవరైనా అతడిని తోసేశారా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.ఫహద్ సౌదీ అరేబియాకు చెందిన అల్ షాబాద్ క్లబ్‌కు ఆడుతుంటాడు. ఆ క్లబ్ తరఫున అద్భుతంగా రాణించడంతో రెండేండ్ల క్రితం ఖతార్ ఆతిథ్యమిచ్చిన ఫిఫా వరల్డ్ కప్‌లో ఫహద్ సౌదీ అరేబియా స్క్వాడ్‌కు ఎంపికయ్యాడు. అయితే.. డోపింగ్ పరీక్షలో విఫలమయ్యాడు. నిషేధిత డ్రగ్ తీసుకున్నాడనే కారణంతో అతడిపై వేటు పడింది.





# విరిగిన చేయితోనే బరిలోకి..

## అందుకే ఆ సెంటీమీటర్ తగ్గింది..!

విశ్వంభర(క్రీడావిభాగం): బ్రస్సెల్స్ వేదికగా జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్లో నీరజ్ చోప్రా రెండో స్థానంతో నిరాశపరిచాడు. ఒక్క సెంటీ మీటర్ తేడాతో టైటిల్ కోల్పోయాడు. అయితే.. ఫైనల్లో నీరజ్ విరిగిన చేయితోనే పోటీ పడ్డాడు. నొప్పిని భరిస్తూనే ఈటెన్ విసిరాడు. కొద్దిలో టైటిల్ కోల్పోయిన భారత బడిసె వీరుడు వచ్చే ఏడాది మరింత బలంతో వస్తానని చెప్పాడు.అయితే.. తన చేయి విరిగిందనే విషయాన్ని పోటీల అనంతరం నీరజ్ ఎక్స్ వేదికగా వెల్లడించాడు. విరిగిన చేయి ఎక్స్ రే ఫొటోను అతడు పోస్ట్ చేశాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో నీరజ్ మూడో ప్రయత్నంలో బడిసెను 87.86 మీటర్ల దూరం విసిరాడు. జులియన్ వెబర్ 87.97 మీటర్ల దూరంలో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ ఎగరేసుకుపోయాడు.'2024 సీజన్ ముగిసింది. ఈ ఏడాదంతా నేను నేర్చుకున్న విషయాలు, మెరుగైన తీరు, ఎదుర్కొన్న కష్టాలు, మానసికంగా సిద్ధమైన తీరు వీటన్నిటినీ బేరీజు వేసుకుంటా. ఇక సోమవారం.. ప్రాక్టీస్ సమయంలో నాచేతికి గాయమైంది. ఎక్స్ రే తీయగా నా ఎడమ చేతి నాలుగో వేలి దగ్గర ఎముక విరిగింది. అది నాకు ఎంతో సవాల్ విసిరింది. అయినా సరే నా బృందం సహాయంతో బ్రస్సెల్స్‌లో నేను పోటీ పడగలిగాను' అని నీరజ్ తెలిపాడు. ఎక్స్ ఖాతాలో నీరజ్ పోస్ట్ చూసిన అభిమానులంతా అతడి పట్టుదలకు జై కొడుతూ.. త్వరగా కోలుకోవాలంటూ కామెంట్లు పెడుతున్నారు. పారిస్ ఒలింపిక్స్ ముందు గజ్జల్లోని కండరాల సమస్య(స్పోర్ట్స్ హెర్నియాలో ఒక రకం)తో చోప్రా బాధ పడ్డాడు. దాంతో, అతడిసన్నద్ధత కూడా సరిగ్గా జరగలేదు. అయినా సరే.. చోప్రా విశ్వ క్రీడల్ల అదరగొట్టాడు. ఫైనల్లో 89.45 మీటర్ల దూరం బడిసెను విసిరి సిల్వర్ మెడల్‌తో చరిత్ర సృష్టించాడు.దేశానికి పతకం అందించాలనే తన లక్ష్యం పూర్తి కావడంతో కొన్ని రోజుల బ్రేక్ తీసుకుంటానని నీరజ్ చెప్పాడు. సర్జరీ చేసుకోవాలని అనుకున్న అతడు గాయం తీవ్రత ఎక్కువ లేనందున మళ్లీ ఈటెను అందుకున్నాడు. సర్జరీ వాయిదా వేసుకొని.. లసానే డైమండ్ లీగ్‌లో పోటీ పడిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

# చెన్నైలో దిగిన బంగ్లాదేశ్ క్రికెటర్లు..

# విజయంపై ధీమాగా కెప్టెన్



విశ్వంభర (క్రీడావిభాగం): టెస్టు, టీ20ల సిరీస్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో అడుగు పెట్టింది. పాకిస్థాన్‌పై చారిత్రక విజయంతో జోరు మీదున్న బంగ్లా బృందం ఆదివారం ఢాకా విమానాశ్రయం చేరుకుంది. ఎయిర్‌పోర్ట్‌లో కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో, లిటన్ దాస్, ప్రధాన కోచ్ చండిక హుతురుసింగేలతో పాటు జట్టు సభ్యులు అభిమానులతో ఫొటోలు దిగారు. ఆ తర్వాత అంతా భాతర విమానం ఎక్కారు. సాయంత్రం కల్లా బంగ్లా జట్టు చెన్నైలో దిగింది. అక్కడి నుంచి టీమ్ హోటల్ చేరిన బంగ్లా క్రికెటర్లకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.స్వదేశంలో అల్లర్ల నేపథ్యంలోనూ పాకిస్థాన్ గడ్డపై టెస్టు సిరీస్ గెలుపొందిన బంగ్లాదేశ్ విజయోత్సాహంతో భారత్‌కు వస్తోంది. తమ జట్టు సభ్యులు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉన్నారని కెప్టెన్ శాంటో అన్నాడు. 'ఇండియాతో సిరీస్ మాకు సవాలే. కానీ, పాకిస్థాన్‌పై విజయం సాధించాం. ఇప్పుడు మా జట్టు సభ్యులలో, బంగ్లా ప్రజల్లో విజయం సాధిస్తామనే నమ్మకం పెరిగింది' అని మీడియా సమావేశంలో శాంటో వెల్లడించాడు. భారత్, బంగ్లాల మధ్య తొలి టెస్టు సెప్టెంబర్ 19న, అనంతరం కాన్పూర్‌లో సెప్టెంబర్ 27న రెండో టెస్టు జరుగనుంది. ఆ తర్వాత టీ20 సిరీస్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి. అక్టోబర్ 3న గ్వాలియర్‌లో తొలి మ్యాచ్, అక్టోబర్ 9న ఢిల్లీలో రెండో టీ20, అక్టోబర్ 12న హైదరాబాద్‌లో మూడో టీ20 జరుగనున్నాయి.

**చరిత్ర సృష్టించింది..**

ఈ మధ్యే పాకిస్థాన్ పర్యటనలో నజ్ముల్ హుసేన్ శాంటో సారథ్యంలోని బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. పాకిస్థాన్‌పై టెస్టుల్లో తొలి విజయం నమోదు చేసి క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఆద్యంతం ఉత్కంఠ రేపిన రావల్పిండి టెస్టులో బంగ్లా 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ముష్ఫికర్ రహీమ్(191) సూపర్ సెంచరీకి.. మెహిదీ హసన్ మిరాజ్(77, 4/21) ఆల్‌రౌండ్ షో తోడవ్వడంతో పాకిస్థాన్‌కు ఓటమి తప్పలేదు.ఇక రెండో టెస్టులోనూ బంగ్లా పేసర్ల ధాటికి పాక్ ఆటగాళ్లు చేతులెత్తేశారు. దాంతో పాక్ గడ్డపై తొలిసారి బంగ్లాదేశ్ టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది. మరోవైపు.. దాదాపు ఏడాది విరామ తర్వాత టీమిండియా సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడుతోంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రోహిత్ సేనకు ఈ సిరీస్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనుంది.

# సాంకేతిక లోపంతో ముంబై- దోహా విమానం నిలిపివేత

## ప్రయాణికుల నిరసన..!

ముంబై: ముంబై నుంచి దోహా వెళ్లాల్సిన ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆదివారం ముంబై – దోహా విమాన సర్వీసు బయలుదేరడానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది. ఆదివారం ఉదయమే టేకాఫ్ కావాల్సిన 'ఇండిగో' విమానం లో సాంకేతిక లోపం రావడంతో మరమ్మత్తు పనులు చేపట్టారు. దీంతో ప్రయాణికులు విమానం లోపలే నాలుగు గంటలకు పైగా కూర్చుండి పోయారు. రాత్రి 8 గంటలకు ఈ విమానం టేకాఫ్ అవుతుందని ఇండిగో వర్గాలు తెలిపాయి.పలు దఫాలు విమానం టేకాఫ్ కావడానికి చర్యలు తీసుకున్నా.. ప్రొసీజరల్ జాప్యం వల్ల చివరకు ఆగిపోవాల్సి వచ్చిందని ఇండిగో యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు పేర్కొంది. బాధిత ప్రయాణికులకు అవసరమైన సాయం అందించామని, భోజనం, స్నాక్స్ తదితర వసతులు కల్పించామని వివరించింది.

# టాప్-10లో తొమ్మిది సంస్థల ఎం-క్యాప్ రూ.2 లక్షల కోట్లు వృద్ధి

**నష్టపోయిన ఎల్ఐసీ..**

విశ్వంభర (బిజినెస్): గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలోని టాప్-10 సంస్థల్లో తొమ్మిది సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,01,552.69 కోట్లు పెరిగింది. ఈక్విటీ మార్కెట్లలో ఇన్వెస్టర్ సెంటిమెంట్ 'బుల్లిష్'గా ఉండటంతో భారతీ ఎయిర్‌టెల్ భారీగా లబ్ధి పొందింది. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు (2.10 శాతం) లబ్ధి పొందింది. గురువారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 83,116.19 పాయింట్ల జీవిత కాల గరిష్టాన్ని తాకింది.భారతీ ఎయిర్ టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.54,282.62 కోట్లు వృద్ధి చెంది రూ.9,30,490.20 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.29,662.44 కోట్లు పెరిగి రూ.8,80,867.09 కోట్ల వద్ద స్థిర పడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ ఎం-క్యాప్ రూ.23,427.12 కోట్లు పుంజుకుని రూ.16,36,189.63 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.22,438.6 కోట్ల వృద్ధితో రూ.6,89,358.33 కోట్ల వద్ద ముగిసింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.22,093.99 కోట్లు పెరిగి రూ.12,70,035.77 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17,480.49 కోట్లు పుంజుకుని రూ.8,07,299.55 కోట్ల వద్ద స్థిర పడింది.ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15,194.17 కోట్లు పెరిగి రూ.6,42,531.82 కోట్ల వద్ద నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.9,878.19 కోట్లు పుంజుకుని రూ.19,92,160.61 కోట్ల వద్ద ముగిసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ.7,095.07 కోట్ల గ్రోత్ తో రూ.7,05,535.20 కోట్లకు చేరుకున్నది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,004.38 కోట్లు నష్టంతో రూ.6,54,004.76 కోట్ల వద్ద నిలిచింది. గత వారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీలో టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతీ స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్ యూఎల్), ఎల్ఐసీ, ఐటీసీ నిలిచాయి.

# కారు అనేది విలువ తరిగిపోయే ఆస్తి

## అందుకే లగ్జరీ కారు కొనలేదు: రాధికా గుప్త



విశ్వంభర (బిజినెస్): సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ.. పెట్టుబడి పాఠాలు, సూచనలు, సలహాలు అందిస్తుంటారు ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా . తన జీవితంలో ఎదుర్కొన్న ఘటనలను, వాటి నుంచి నేర్చుకున్న పాఠాలను సందర్భం వచ్చినప్పుడు పంచుకుంటుంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె లగ్జరీ కార్లను కొనుగోలు చేయకపోవడానికి గల కారణాన్ని చెప్పారు."లగ్జరీ కారు కొనుగోలు చేయగల సామర్థ్యం ఉంది. బోనస్ వచ్చిన ప్రతిసారీ ఒక మంచి ఫ్యాన్సీ కారు కొనాలని అనుకుంటాను. కానీ, కారు అనేది విలువ తరిగిపోయే ఆస్తిగా భావిస్తాను. ఒకవేళ దాన్ని విక్రయించాలన్నా ఆ విలువ 30 శాతం తగ్గిపోతుంది" అని రాధికా గుప్తా లగ్జరీ కారు కొనుగోలు చేయకపోవడానికి గల కారణాన్ని వివరించారు. ఓ పాడ్కాస్ట్‌లో పాల్గొన్న ఆమె తన కాలేజీ రోజుల్లో ఎదురైన సంఘటనలను గుర్తుకు తెచ్చుకున్నారు. 18 ఏళ్ల క్రితం కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకొని బయటకు వచ్చాను. ఆ సమయంలో చాలా మంది నా వద్దకు వచ్చి నీ దగ్గర కనీసం ఫ్యాన్సీ బ్యాగ్ లేదా? అని అడిగేవారు. ఆ సమయంలో చాలా బాధేసింది. ఏమీ మాట్లాడలేకపోయేదానిని. కానీ ఇప్పుడు ఎవరైనా వచ్చి ఎందుకు ఇన్నోవా నడుపుతున్నావు? అని అడిగితే కచ్చితంగా బదులిస్తాను. నా జీవితం, నా ఇష్టమని. ఎందుకంటే ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు" అని రాధికా అన్నారు.




# హరిహర వీరమల్లు షూటింగ్ అప్‌డేట్

**విశ్వంభర, సినిమా :** పవన్ కళ్యాణ్ ఏపీ ఎన్నికల్లో గెలిచి డిప్యూటీ సీఎం అయ్యాక చేతిలో ఉన్న మూడు సినిమాలని ఎలాగైనా పూర్తిచేస్తానని చెప్పాడు. పవన్ ఫ్యాన్స్ OG, హరిహర వీరమల్లు సినిమాల కోసం ఎదురుచూస్తున్నారు. పవన్ డేట్స్ ఎప్పుడు ఇస్తే అప్పుడు షూట్ చేసేద్దామని మూవీ యూనిట్స్ ఎదురుచూస్తున్నాయి. ఇటీవల హరిహర వీరమల్లు మూవీ షూట్ మొదలుపెట్టి పవన్ కళ్యాణ్ లేని సీన్స్ ని షూట్ చేశారు. పవన్ కూడా షూట్ లో జాయిన్ అవుదాము అనుకునేలోపు వరదలు వచ్చాయి. ఏపీలో వరదల వల్ల పవన్ బిజీ అయిపోయారు. దీంతో హరిహర వీరమల్లు షూట్ మళ్ళీ ఆగింది. తాజా సమాచారం ప్రకారం పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు సినిమాకు డేట్స్ ఇచ్చారంట. ఆ సినిమా షూట్ మొదలుకాబోతుంది. హరిహర వీరమల్లు సినిమా సెప్టెంబర్ 23 నుంచి షూటింగ్ మొదలు కానుందని సమాచారం. పవన్ కళ్యాణ్ సెప్టెంబర్ 23న షూట్ లో జాయిన్ అయి దాదాపు 20 రోజుల పాటు షూటింగ్ లో పాల్గొననున్నారని తెలుస్తుంది. ఓ పక్క షూటింగ్ చేస్తూనే మరోపక్క ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చూసుకోనున్నారు పవన్. దీంతో పవన్ ఫ్యాన్స్ సంతోషంతో పాటు సందేహం కూడా వ్యక్తం చేస్తున్నారు. ఈసారైనా పవన్ పూర్తిగా షూటింగ్ లో పాల్గొంటారా లేక మళ్ళీ ఏదైనా ప్రభుత్వ పనులు అడ్డం వచ్చి వచ్చి షూటింగ్ ఆగుతుందా అని ఆలోచిస్తున్నారు. ఒక వేల షూట్ మొదలుపెట్టి పవన్ జాయిన్ అయితే మాత్రం నెల రోజుల్లో షూట్ పూర్తిచేయడానికి ప్రయత్నిస్తారట మూవీ టీమ్.

## కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన కార్తీ..

**విశ్వంభర, సినిమా :** తమిళ స్టార్ నటుడు కార్తీ మరో కొత్త ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశాడు. ఇప్పటికే సత్యం సుందరం, సర్దార్, వా వాతియర్ సినిమాలతో బిజీగా ఉన్న కార్తీ మరో కొత్త ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశాడు. తానక్కరన్ సినిమా ఫేం దర్శకుడు తమిళ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాను డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై SR ప్రకాష్‌బాబు, SR ప్రభు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అయితే ఈ బ్యానర్‌లో ఇప్పటికే కార్తీ ధీరన్ అధిగారమ్ ఒంద్రు(ఖాకీ) సినిమాతో పాటు సుల్తాన్, కాష్మోరా, జపాన్ సినిమాలను చేశాడు. మళ్లీ ఈ బ్యానర్‌లో కార్తీ సినిమా రానుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.కార్తీ29 అంటూ ఈ ప్రాజెక్ట్ రానుండగా.. ఈ మూవీకి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు. ఈ పోస్టర్‌లో ఒక భారీ ఓడ సముద్రంలో వెళుతున్నట్లుగా ఉంది. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానుంది.

## కొత్త విడుదల తేదీ కోసం చూస్తున్న సూర్య 'కంగువ'

**విశ్వంభర, సినిమా :** తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోంది. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ 3డీ ఫార్మాట్‌లో సందడి చేయనుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి కంగువ గ్లింప్స్‌తో పాటు పోస్టర్‌లు విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఈ సినిమాను దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమా విడుదల తేదీ రోజునే తమిళంలో మరో పెద్ద సినిమా రాబోతుంది. ఇండియన్ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్'. తెలుగులో వేటగాడు అని వస్తున్న ఈ సినిమాకు జై భీమ్ ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అయితే ఈ రెండు సినిమాలు ఒకే రోజు విడుదల అయితే బాక్సాఫీస్ వద్ద క్లాష్ అవ్వడంతో పాటు కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశముందని కంగువ టీం అలోచిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఈ సినిమా విడుదల తేదీని అక్టోబర్ నుంచి నవంబర్‌కు షిఫ్ట్ చేయనున్నట్లు తెలుస్తుంది. మరోవైపు హీరో సూర్య కూడా.. రజినీకి గౌరవం ఇచ్చి తన సినిమాని వాయిదా వేస్తున్నట్లుగా కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతుంది. కాగా ఈ వార్తలపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



# లాగి చెంపమీద ఒక్కటి ఇచ్చాను
## ఈషా డియోల్

విశ్వంభర, సినిమా : పని చేసే ప్రాంతంలో వేధింపులపై మహిళ తప్పకుండా స్పందించాలని నటి ఈషా దేవోల్ తెలిపారు. ఓ సినిమా ఫంక్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని, తట్టుకోలేక చెంప మీద కొట్టానని చెప్పారు. ఆమె మాట్లాడుతూ ''2005లో తెరకెక్కిన 'దాస్' (Dass) ప్రీమియర్ ఈవెంట్‌లో ఒక సంఘటన చోటుచేసుకుంది. ఆ సినిమా ప్రమోషన్స్ భాగంగా పుణెలో ఈవెంట్ నిర్వహించారు. ప్రధాన నటీనటులతో కలిసి నేనూ ఆ కార్యక్రమానికి వెళ్లా. మమ్మల్ని చూసేందుకు జనాలు పెద్ద ఎత్తున వచ్చారు. చాలామంది బౌన్సర్ల మధ్య ఫంక్షన్ హాల్‌లోకి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నన్ను అభ్యంతరకర రీతిలో తాకాడు. నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. వెంటనే, అతని చేయి పట్టుకొని గుంపులో నుంచి బయటకు లాగి.. చెంప చెళ్లుమనిపించా. అందరూ షాక్ అయ్యారు. సాధారణంగా నేను సరదాగా ఉండే వ్యక్తిని. నా సహనాన్ని పరీక్షిస్తూ ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే తప్పకుండా రియాక్ట్ అవుతా. నేనే కాదు ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతి మహిళా స్పందించాలి. శారీరకంగా పురుషులు బలవంతులు కావచ్చు. అంతమాత్రాన స్త్రీలను ఇబ్బందిపెట్టే హక్కు వారికి లేదు'' అని ఈషా అన్నారు.బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర, నటి హేమామాలిని దంపతుల కుమార్తెగా ఈషా దేవోల్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 'కుచ్ తో హై', 'యువ', 'ధమ్', 'కాల్', 'క్యాష్', 'హైజాక్' వంటి చిత్రాల్లో ఆమె నటించారు. ప్రస్తుతం ఆమె చేతిలో 'హీరో హీరోయిన్' అనే మూవీ ఉంది.










Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com